



# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక






బుధవారం 25.03.2020
• సంపుటి 9 • సంచిక 290 • వెల. రూ. 6.50
హైదరాబాద్
పేజీలు : 10 + 12/8
ఉగాది
సూర్యోదయం: ఉదయం 6.15, సూర్యాస్తమయం: సాయంత్రం 6.23, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం పాడ్యమి సాయంత్రం 5.26 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: రేవతి, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 12.19 నుంచి 1.50 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.55 నుంచి మధ్యాహ్నం 12.43 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.48 నుంచి రాత్రి 7.36 వరకు.
PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline




రోడ్లపైకి ఎవరూ రావద్దని పోస్టర్‌ను చూపుతున్న ప్రధాని నరేంద్రమోదీ

- ప్రపంచంలో 4 లక్షల మందికి సోకిన వైరస్ 196 దేశాలలో 18 వేల మంది దుర్మరణం
- అమెరికాలో 24 గంటల్లో 16,354 కేసులు 550 మంది మృతి.. రంగంలోకి సైన్యం
- భారత్‌లో 536 కేసులు.. 10 మంది మృతి రాష్ట్రంలో మరో ఆరుగురికి.. పాజిటివ్ 39

## ఇంట్లోనే ఉందాం.. పండుగ చేసుకుందాం..

శార్వరి అంటే రాత్రి. రాత్రి అంటే విశ్రాంతికి సూచిక. కాకతాళీయమే కావచ్చు.. కానీ జాతి యావత్తూ అనివార్యంగా విశ్రాంతి తీసుకోవాల్సిన వేళ.. శార్వరి నామ సంవత్సర ఉగాది వచ్చింది. ప్రతి రాత్రి తర్వాతా ఒక ఉదయం తప్పక ఉంటుంది. నిశి రాతిరి చీకటి దాటినాక సూరీడి వెలుగురేఖ కచ్చితంగా చుక్కపొద్దును చూపిస్తుంది. కరోనా చీకట్లు శాశ్వతం కాదు; మనందరి మనసులో సంకల్ప సూర్యుడు ఉదయిస్తే, ఈ చీకటిని చీల్చి చెండాడటం ఎంత పని! గండాలెన్నింటినో దాటిన గండరగండళ్లం మనం. సంతోషంగా పండుగ జరుపుకొందాం. సంయుక్తంగా కరోనాను తరిమికొడుదాం.

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు శ్రీశార్వరి నామసంవత్సర ఉగాది శుభాకాంక్షలు.

- దీవకొండ దామోదర్‌రావు, సీఎండీ, నమస్తే తెలంగాణ

# ఇండియా లాక్‌డౌన్



## ఏప్రిల్ 14 వరకు దేశమంతటా ఆంక్షలు

### అర్ధరాత్రి నుంచే అమల్లోకి

- కరోనా కట్టడికి ఇదే ఏకైక మార్గం
- ప్రజలెవరూ గడపదాటొద్దు చేతులు జోడించి వేడుకుంటున్నా
- సామాజిక దూరంతోనే అడ్డుకట్ట
- లేదంటే భారీ మూల్యం తప్పదు
- ఆర్థికంగా పెనునష్టం కలిగినా.. ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం
- జాతినుద్దేశించి ప్రధాని సందేశం

**న్యూఢిల్లీ, మార్చి 24:** దేశంలో వేగంగా వ్యాపిస్తున్న కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కీలక నిర్ణయం తీసుకున్నారు. 21 రోజులపాటు దేశం మొత్తాన్ని లాక్‌డౌన్ చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ఇది అమల్లోకి వస్తుందని తెలిపారు. ఈ మూడు వారాలపాటు ప్రజలెవరూ తమ ఇంటి 'లక్ష్మణరేఖ'ను దాటి బయటకు రావొద్దని చేతులు జోడించి విజ్ఞప్తిచేశారు. వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు సామాజిక దూరం పాటించడమే ఏకైక మార్గమని నొక్కిచెప్పారు. తాజా నిర్ణయంతో ఆర్థికంగా పెను నష్టం సంభవిస్తుందని, అయితే దేశ ప్రజల ప్రాణాలే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో మంగళవారం రాత్రి ప్రధాని మోదీ రెండోసారి జాతినుద్దేశించి

మిగతా 5వ పేజీలో



"కూరగాయల ధరల్ని పెంచడం బాధాకరం. రాష్ట్రంలో 30 లక్షల టన్నుల కూరగాయలు ఉత్పత్తి అవుతాయి. మనం వాడుకొనేవి 27 లక్షల టన్నులే. మూడు లక్షల టన్నుల మిగులు మన దగ్గర ఉంది. అయినప్పటికీ, ధరలు పెంచుతామంటే కుదురదు. అయ్యా బుచ్చి, అవ్వా బుచ్చి అంటే నడువదు. ఎవరైనా ఎక్కువ ధరలకు అమ్మితరో పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపిస్తా."

- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

# ఇల్లు కదలొద్దు

- ప్రజలంతా నియంత్రణ పాటించాల్సిందే
- లేకుంటే 24 గంటల కర్ఫ్యూ
- అప్పటికీ వినకుంటే కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు
- అవసరమైతే రంగంలోకి ఆర్మీ
- ఆ పరిస్థితులను కొనితెచ్చుకోవద్దు
- మీడియాతో సీఎం కేసీఆర్

2



"ప్రజలు మనవాళ్లు కాబట్టి మంచి పద్ధతిలో సంజాయించి ముందుకుపోవాలని ప్రభుత్వపరంగా చర్యలు తీసుకొంటున్నం. దానికి ప్రజలు వందశాతం సహకరించాలి. లేకుంటే ప్రొసీడింగ్స్ ఆగుతయా అంటే ఆగవు. అమెరికా వంటి దేశం.. అంత మెచ్యూరిటీ ఉండే దేశం అక్కడ స్థానిక పోలీసులు కంట్రోల్ చేయలేక ఆర్మీని పిలిపించారు. ఆర్మీకి అప్పగించారు. మన దగ్గర కూడా ఏమైతదంటే, పోలీసులకు సహకరించకుంటే అటోమేటిక్‌గా 24 గంటల కర్ఫ్యూ పెట్టాల్సి వస్తుంది. కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు ఇవ్వాల్సివస్తుంది. అప్పటికి కూడా కంట్రోల్ కాకుంటే ఆర్మీకి అప్పగించాల్సి వస్తుంది. ఆర్మీకి అప్పగించే పరిస్థితిని తెచ్చుకొందామా?"

- సీఎం కేసీఆర్



## ఏటీఎం చార్జీలు రద్దు

- ఏ ఏటీఎం నుంచైనా నగదు విత్‌డ్రా అవకాశం
- జూన్ 30 వరకు చార్జీల భారం ఉండదు
- ఖాతాల్లోనూ కనీస నగదు నిల్వలు అక్కర్లేదు
- కరోనా వైరస్ నేపథ్యంలో కేంద్రం నిర్ణయం

7



## అత్యవసరాల్లో ఆపన్నహస్తం

- ట్విట్టర్ ద్వారా పలువురి సమస్యలకు కేటీఆర్ పరిష్కారం
- ఆంధ్రప్రదేశ్ వాసులకూ భరోసా

6

TOKYO 2020

## టోక్యో ఒలింపిక్స్ వాయిదా

- కరోనా విజృంభణతో వచ్చే ఏడాదికి విశ్వక్రీడలు
- ఐవోసీ చారిత్రాత్మక నిర్ణయం
- వాయిదాను ఆహ్వానించిన అథ్లెట్లు, సభ్యదేశాలు

7



## బలపరీక్షలో నెగ్గిన చౌహాన్

6









లాక్‌డౌన్ డే-2

క్షణాలు మాత్రమే కల్లోలితం
ఆత్మస్థైర్యాలు కాదు కదా
సమూహాలు మాత్రమే సంక్షోభితం
సాయం చేసే గుండెలు కాదు కదా..!
ఎన్ని చూడలేదు మనం


అయినంపూడి శ్రీలక్ష్మి



కరోనా కట్టడి చర్యలు, లాక్‌డౌన్ పరిస్థితులపై మంగళవారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి కూడా ఉన్నారు.

# ఇల్లు కదలొద్దు

## ప్రజలంతా నియంత్రణ పాటించాల్సిందే

**లేకుంటే 24 గంటల కర్ఫ్యూ • అప్పటికీ వినకుంటే కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు**

**అవసరమైతే రంగంలోకి ఆర్మీ • ఆ పరిస్థితులను కొనితెచ్చుకోవద్దు • మీడియాతో సీఎం కేసీఆర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కరోనా నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలను ప్రజలంతా కచ్చితంగా పాటించి తీరాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ గడువు పూర్తయ్యేదాకా ఏ ఒక్కరూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇల్లు వదిలి బయటకు రావొద్దని స్పష్టంచేశారు. ప్రభుత్వం ప్రజలకు మంచి పద్ధతిలో చెప్పి ముందుకు పోవాలని చూస్తున్నదని, అందుకు ప్రజలు నూటికి నూరుశాతం సహకరించాలని కోరారు. ప్రజలు నియంత్రణ పాటించకుంటే.. 24 గంటల కర్ఫ్యూ విధించాల్సి ఉంటుందని.. అప్పటికీ వినకుంటే కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు ఇవ్వాల్సివస్తుందని.. అవసరమైతే ఆర్మీని కూడా రంగంలోకి దింపాల్సి వస్తుందని హెచ్చరించారు. కరోనా వ్యాప్తి నిరోధంపై తీసుకొంటున్న చర్యలపై మంగళవారం ప్రగతిభవన్‌లో దాదాపు ఐదు గంటలటు ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ కరోనా కట్టడికి తీసుకొంటున్న చర్యలు, ప్రజల నుంచి అందాల్సిన సహకారంపై మాట్లాడారు. సీఎం ప్రసంగం.. ఆయన మాటల్లోనే..

### అంతా కోలుకొంటున్నారు

కరోనాకు సంబంధించి ఇప్పటివరకు పాజిటివ్ వచ్చిన కేసులు 36. ఒకరు ట్రీట్‌మెంట్ తీసుకుని వెళ్లిపోవడంతో 35 కేసులు ఉన్నాయి. ఎవరికి కూడా ప్రమాదంలేదు. ఆక్సిజన్, వెంటిలేటర్లు పెట్టడంలేదు. అంతా కోలుకొంటున్నరు. ఇప్పుడు ఉన్నవాళ్లు ఇంచుమించుగా ఏప్రిల్ 7 వరకు కోలుకొంటరు. ఈ లోగా కొత్తకేసులు రాకుంటే జీరోకు పోతాం. కాబట్టి మనకు పెద్దగా ప్రబలకపోవచ్చు. కానీ ముందుజాగ్రత్త చర్యలు మాత్రం గట్టిగా తీసుకోవాల్సిన అవసరమున్నది. 195 దేశాలకు కరోనా పాకింది. ఫారిన్ నుంచి వచ్చినవారు తిరిగినచోట వాళ్లకు కూడా సంక్రమించి ఉంటుందేమో అని అనుమానించి 19,313 మందిని సర్వైలెన్స్‌లో పెట్టినం. జిల్లా కలెక్టర్లు, అధికారులకు వీడియో కాన్ఫరెన్స్‌లో స్ట్రిక్ట్‌గా ఆదేశాలిచ్చినం. వాళ్ల పాస్‌పోర్టులను సీజ్ చేయాలని చెప్పినం. ఒక వ్యక్తి నిర్మల్‌లో మూడుసార్లు కంటిన్యూగా తప్పించుకున్నడు. వీళ్లను కంట్రోల్ చేయాల్సిందే. కరోనా లక్షణాలున్న అనుమానితులు 114 మంది ఉన్నారు. వీరిలో 82 మంది విదేశాల నుంచి వచ్చినవాళ్లున్నరు. వీరిలో 32 మందికి సోకి ఉండవచ్చనే అనుమానమున్నది. వీళ్ల నమూనాలు పరీక్షలకు పంపించాం. బుధవారం రిపోర్టులు వస్తాయి. ఎంతమందికి పాజిటివ్ ఉన్నదో తెలుస్తుంది.

### అప్రమత్తంగా ఉండాలి

ప్రధానమైన విషయాన్ని ప్రజలకు మనవిచేస్తున్న. ఈ జబ్బు పెద్ద మహమ్మారి. యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్నది. ఒక ఊరికో, పల్లెకో, వ్యక్తికో పరిమితం కాలేదు. పరిమిత సమస్య కాదు. ఇది ప్రత్యేక సందర్భం. ప్రత్యేక పరిస్థితి. కాబట్టి అందరం అప్రమత్తంగా ఉండాలి. కరోనాపై కొందరు కవులు మంచి కవిత్వాలు రాశారు. ఐనంపూడి శ్రీలక్ష్మి అనే కవయిత్రి అద్భుతమైన కవితరాశారు. ఇప్పుడు క్వారంటైనే మన వాలంటైన్ అన్నారు. గొప్ప భావం ఇది. రాష్ట్రంలో ఉన్న కవులందరినీ కోరుతున్న. మంచి కవితలు రాయాలి. టీవీ వాళ్లను కోరుతున్న.. కరోనా మీద ప్రజలను చైతన్యపర్చేవిధంగా కవి సమ్మేళనాలు నిర్వహించాలి.

### స్టాండింగ్ కమిటీల భాగస్వామ్యం

పంచాయతీల్లో 8,20,727 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులున్నారు. మున్సిపాలిటీ స్టాండింగ్ కమిటీలో 3,400 సభ్యులున్నారు. వార్డుల్లో 2,04,300 మంది సభ్యులున్నారు. మొత్తం కలిపితే పది లక్షలమంది ఉన్నారు. వీళ్లందరితో ప్రజాసైన్యం తయారుకావాలి. ఆయా వార్డుసభ్యులు, సర్పంచ్‌లు, మేయర్లు, చైర్మన్లు.. తమ తమ స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుపుకొని పనిచేయాలి. ఏ ఊరి సర్పంచ్ ఆ ఊరి కథానాయకుడు కావాలి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు, సింగిల్ విండో చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు అంతా తమ తమ పరిధుల్లో కథానాయకులు కావాలి. ప్రజల మధ్యలో పోలీసులతో కలిసి పనిచేయాలి. ఎక్కడైనా దుర్మార్గులు ఉంటే మనం కూడా లాఠీ పట్టుకొని నిలబడాలి. కొట్టాలని కాదు కానీ.. అంత కచ్చితంగా పనిచేస్తేనే ఈ సమస్యను అధిగమిస్తాం. ఎవరి గ్రామం వాళ్లు, ఏ పట్టణం వాళ్లు సమన్వయం చేసుకుంటే ఈ సమస్య ఇంత పెద్దగ రాదు.

### హోం క్వారంటైన్‌లపై నిఘా

హోం క్వారంటైన్‌లో ఉన్నవారిపై గట్టి నిఘా పెట్టాలని చెప్పినం. వారి పాస్‌పోర్టులను సీజ్ చేయమని చెప్పినం. కొందరు పారిపోతున్నారు. నకరాలు చేస్తున్నారు కాబట్టి, పాస్‌పోర్టులను సస్పెండ్ కూడా చేయిస్తాం. పౌర సమాజానికి శత్రువులుగా పరిణమించేవాళ్లు కాబట్టి, సమాజ శ్రేయస్సుకే భంగం వాటిల్లజేస్తామంటే వాళ్లకు సమాజంద్వారా లాభాలు పొందే అర్హతలేదు. కాబట్టి, నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లకు, ఎస్పీలకు ఆదేశాలిచ్చినం. చెక్‌పోస్టుల వద్ద రకరకాల వస్తువుల్ని తెచ్చిన వాహనాలు 3,400 దాకా ఉన్నాయి. వాటికి సంబంధించి ఈ ఒక్కరోజు టోల్‌ను మాఫీచేస్తున్నాం. ఇందుకు సంబంధించి రవాణా, పోలీసుశాఖలకు ఆదేశాలిచ్చాం. ఈ రాత్రికి అవన్నీ ఫ్రీ అయిపోతాయి. తెల్లారేసరికి వారి సరఫరా మొత్తం ముగిసిపోవాలి.

### అత్యవసరాల్లో డయల్ 100

ఎక్కడో మారుమూల గ్రామంలో ఎవరికైనా అపెండిసైటిస్ నొప్పి రావొచ్చు లేదా గుండె జబ్బు రావొచ్చు. ఎవరికైనా బంధువు చనిపోవచ్చు లేదా తండ్రి చనిపోవచ్చు. ఇలా ప్రజలకు రకరకాల సమస్యలు రావొచ్చు. దీంతో ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు కొడుకు పోవాల్సి రావొచ్చు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లాల్సి రావొచ్చు. డెత్ విషయంలో కానీ ఎమర్జెన్సీ విషయంలో కానీ ఇంకా ఏమైనా అత్యవసరాలు తలెత్తితే, 100కు డయల్ చేయాలి. వెంటనే అధికారులు స్పందిస్తారు. సాయం చేస్తారు. అవసరమనుకుంటే వాహనం కూడా సమకూరుస్తారు.

## ఆపత్కాలంలో ప్రజలవెంటే ఉండాలి

**హైదరాబాద్‌లోగానీ,** జిల్లాల్లోగానీ నియంత్రణ విషయంలో పోలీసులు, కలెక్టర్లు, మున్సిపల్, ఇతర సిబ్బంది కనపడుతున్నరు. ప్రజాప్రతినిధులంతా ఎక్కడికి పోయారు? జీహెచ్‌ఎంసీలో 150 మంది కార్పొరేటర్లు ఏంచేస్తున్నరు? బాధ్యత లేదా? వందశాతం వెంటనే రంగంలోకి దిగాలి. జంటనగరాల్లోని మూడు కమిషనరేట్ల పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, మేయర్లు, చైర్మన్లు అంతా రంగంలోకి దిగాలి. చౌరస్తాలో నిలబడాలి. ఇలాంటి ఆపత్కాల పరిస్థితుల్లో మనం ప్రజలతో ఉన్నామా? లేదా? అనే చూస్తరు. ప్రజాప్రతినిధులంతా స్థానిక పోలీసులతో కో-ఆర్డినేషన్ చేసుకొని ఎక్కడ లోటుపాట్లు లేకుండా, అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలి. ప్రతి చెక్‌పోస్ట్ దగ్గర మనమే ఉండాలి. అది మన విధి. బాధ్యత. ఈ సమయంలోనే మనం పనిచేస్తమని ఎన్నుకొన్నరు. మనం గెలిచిందే వాళ్లకోసం. ఇలాంటి ఆపత్కాల పరిస్థితు ల్లో ప్రజలతో ఉండాలి. ప్రజలకోసం పనిచేయాలి. మంత్రులంతా తమ తమ జిల్లాలకు పోవాలి. జిల్లా కేంద్రాల్లో ఉండాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీమీ నియోజకవర్గాల్లోనే ఉండి పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమన్వయంచేసుకోవాలి. ఇద్దరు ముగ్గురు ఆరోగ్య, వ్యవసాయ, మున్సిపల్ మంత్రులు కొంత అటూఇటూ తిరిగినా పర్వాలేదు. మిగిలినవారంతా వారి నియోజకవర్గాలకు పోయి సమస్యను ఎదుర్కొనే విధంగా ప్రజలను చైతన్యపరచాలి.

ప్రగతిభవన్‌లో గంగాళం..



**వ్యక్తిగత** పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని ప్రగతిభవన్ నుంచే ప్రారంభించారు. ఇందుకోసం ప్రగతిభవన్ బయట రెండు పెద్దగంగాళాల్లో నీళ్లు పెట్టారు. సబ్బులు, శానిటైజర్‌ను ఉంచారు. మంగళవారం సీఎం కేసీఆర్ నిర్వహించిన రాష్ట్రస్థాయి అత్యున్నతస్థాయి సమావేశానికి హాజరైన మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతోపాటు వైద్యారోగ్య, పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ, ఆర్థిక తదితరశాఖలకు చెందిన ముఖ్యకార్యదర్శులు సబ్బుతో చేతులు కడుక్కొని, శానిటైజర్‌తో శుభ్రం చేసుకున్నాకే ప్రగతిభవన్‌లోకి ప్రవేశించారు. ప్రతిఇంట్లో, ప్రతి కార్యాలయంలోనూ ఇలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ సూచించారు.
– హైదరాబాద్, నమస్తే తెలంగాణ

# ఇప్పుడా కొల్లగొట్టేది?

**కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచితే కఠిన చర్యలు**

**లైసెన్సులు రద్దు.. పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపుతాం**

**జీవితాలను, వ్యాపారాలను పాడుచేసుకోవద్దు**

**తస్మాత్ జాగ్రత్త.. వ్యాపారులకు సీఎం కేసీఆర్ తీవ్ర హెచ్చరిక**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కరోనా నేపథ్యంలో రాష్ట్రం లాక్‌డౌన్ పరిస్థితిని అదునుగా చేసుకొని ఎవరైనా కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచితే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ 'కూరగాయల ధరల్ని పెంచడం బాధాకరమైన విషయం. 30 లక్షల మెట్రిక్ టన్ను ల కూరగాయలు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతాయి. మనం వాడుకొనేవి 27 లక్షల మెట్రిక్ టన్నులే. మూడు లక్షల టన్నుల కూరగాయల మిగులు మన దగ్గర ఉంటుంది. అయినా, ధరలు పెంచుతామంటే కుదురదు. అయ్యా బుచ్చి, అవ్వా బుచ్చి అంటే నడువదు. రేపట్నుంచి ఎవరైనా ఎక్కువ ధరలకు అమ్మితే పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపిస్తాం. అందులో ఎలాంటి అనుమానంలేదు. కలెక్టర్లకు ఆర్డర్లు ఇచ్చినం. అధికంగా ధరలు పెంచి ఈ టైములోనే ప్రజల రక్తం పిండుకుంటామని ఎవరైనా అనుకున్నా.. కూరగాయలు ధర పెంచినా, నిత్యావసర సరుకుల ధరలు పెంచినా లైసెన్సులు క్యాన్సిల్‌చేస్తాం. దుకాణాలు సీజ్‌చేస్తాం. తస్మాత్ జాగ్రత్త. మీ జీవితాలు పాడుచేసుకోవద్దు, వ్యాపారాల్ని దెబ్బతీసుకోవద్దు. మిమ్మల్ని పర్మనెంట్ ట్రెయిటర్స్ కింద ప్రభుత్వం ఐడెంటిఫై చేస్తది. మిమ్మల్ని బ్లాక్ లిస్టులో పెడతది. తర్వాత ఎంత రోదించినా లైసెన్సులు రావు. షాపులు కూడా రద్దు చేస్తాం. అన్నీ పోతాయ్. దేశమంతటా అల్లకల్లోలం, ప్రపంచమంతా అల్లకల్లోలం అవుతుంటే ఈ సమయమే దొరికిందా ధరలు పెంచడానికి? జేబులు కొల్లగొట్టేది ఇప్పుడేనా మీకు? ఇంత దుర్మార్గం ఎందుకు మీకు? అది పద్ధతి కాదు. ఈ సమస్య ఎప్పటివరకూ కంటిన్యూ అవుతుందో ఎవరికీ తెలియదు. మన చేతుల్లో లేదు. అమెరికా వంటి దేశమే ఇయ్యాల హయ్యెస్ట్ సఫరర్. అక్కడి కేసులు 45 వేలు దాటినయి. ఒక ఉత్పాతంలో భయంలో పడ్డ రక్కడ. ఆర్మీని పిలిచారు. షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్ ఇచ్చారు. ఇలాం టి సమయంలో పిచ్చి పిచ్చి పనులు చేస్తే ఇబ్బంది ఉంటుంది. మన దేశంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్ని లెక్కిస్తే ముప్పైయ్‌వరకూ లాక్‌చేశారు. మన రాష్ట్రంలో బయటికి పోదామంటే అవకాశం లేదు. అడుగడుగునా చెక్‌పోస్టు. అయినా ఎందుకు పోవాలి? ఎటు పోతరు? అవసరం లేదు. వేరే దేశం, రాష్ట్రం, పుణ్యక్షేత్రం పోదామంటే అవసరంలేదు. దయచేసి ప్రజలందరికీ దండం పెట్టి మనవి చేస్తా ఉన్నా. ఒక ఆపత్కాల సమయంలో మనమంతా కచ్చితంగా నియంత్రణ పాటించాలి. షాపులు ఎట్టి పరిస్థితుల్లో ఆరు గంటలకు క్లోజ్ చేయాలి. గుంపులు గుంపులుగా షాపుల మీద పడకూడదనే పొద్దున్నుంచి సాయంత్రం వరకూ పెట్టినం. లేని గాబరాను తెచ్చుకోవద్దు. ప్రజలు ఒకచోట గుమికూడదనేది మన ప్రిన్సిపుల్. ప్రతి వ్యక్తి మధ్య మూడు అడుగుల డిస్టెన్స్ మెయింటెయిన్ చేయాలి. పదే పదే నేను విజ్ఞప్తి చేస్తాఉన్నా. ఈ నాలుగురోజులు కండ్లు మూసుకొని ఉంటే, ఈ మొత్తం రాష్ట్రాన్ని కాపాడుకున్నవాళ్లం అవుతాం. టు వీలర్ వద్ద పోయేవాళ్లు, మార్కెట్‌కు వెళ్లేవారు.. ఎక్కువ దూరం పోలేరు. ఎందుకంటే, ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు న్నాయి. హైదరాబాద్ సిటీని దాటలేరు. కూరగాయలు కానీ నిత్యావసర వస్తువులు కానీ మూడు కిలోమీటర్ల లోపు షాపుల్లోనే కొనాలి.

### రేపట్నుంచి రేషన్ పంపిణీ

గురువారం నుంచి బియ్యం సరఫరా చేస్తం. రూ.1500ను దళారీలు లేకుండా నేరుగా బ్యాంకుఖాతాల్లో వేస్తం. ఇప్పటికే బ్యాంక్ అకౌంట్ల వివరాలు సేకరించిన్రు. ఇంకా సేకరిస్తున్నరు. వాళ్ల అవసరాలకు అనుగుణంగా అవి ఖర్చు పెట్టుకుంటరు. ఇట్ల ఈ పనులన్నీ ఉన్నతాధికారులు చూసుకోవాల్సి ఉన్నది. ప్రభుత్వం, క్యాబినెట్ నిర్ణయాలను అమలుచేయడంలో భాగంగా పాలు, కూరగాయలు, నిత్యావసరవస్తువులు ఎలా పంపిణీ చేయాలి, ఎలా సమన్వయం చేయాలి? మందుల సరఫరా, కరోనా పాజిటివ్ కేసుల చికిత్స, విదేశాల నుంచి వచ్చినవారి పరిస్థితి ఏంది? ఇలా అన్ని సమన్వయం చేసుకోవాల్సి ఉంది. ఇట్ల అన్ని అంశాలపై యంత్రాంగం ఒత్తిడిలో ఉంటది. ప్రజలు వాళ్లందరికీ సహకరిస్తేనే వాళ్లు మంచి సేవలు అందిస్తరు. పోలీసులు ఆపుతున్నరంటే మన కోసం, మన మేలు, బాగు కోసం ఆపుతున్నరుగానీ వాళ్లకు వ్యక్తిగతంగా వచ్చే మేలు ఏమీ లేదు.

## వినకపోతే పెట్రోల్ బంద్ పెడ్తం

**ప్రజలను** మేం ఆపలేకపోతే ఏం చేస్తాం? పెట్రోల్ పోయడాన్ని బంద్‌చేస్తం. మనమీబాధ తెచ్చుకోవద్దు. ఇక ఆగుతలేరు, మనం కంట్రోల్ చేయలేకపోతున్నామంటే పెట్రోల్ బంకులను కూడా క్లోజ్ చేయాల్సివస్తది. రాష్ట్ర ప్రభుత్వానికి ఇదంతా ఇష్టమా? సంతోషమా? చాలా దుఃఖం కదా మాక్కూడా. రోజు కొన్ని వందల కోట్ల రూపాయల ఆదాయం పోతాఉన్నది. ఎకనామిక్‌గా కూడా చాలా కష్టం వస్తున్నది. వాటన్నింటినీ దిగమింగుకుంటూ, భరిస్తూ ప్రజల క్షేమాన్ని కోరుకుంటూ ఇయ్యాల ఆదేశాలిచ్చినాం. ఆరోగ్యశాఖకు ఎట్టి పరిస్థితుల్లో నిధుల కొరత రావొద్దని సీఎస్‌కు ఆదేశాలిచ్చినం. టెస్టింగ్ కిట్లు కానీ మాస్కులు కానీ మరొకటి కానీ మరేదైనా మిగతా వాటికి ఆపి, ఆరోగ్యశాఖకు టాప్ ప్రయార్టీలో నిధులివ్వాలని చెప్పినం. పోలీసులకూ అవసరమైన నిధులు సమకూర్చాలని చెప్పినం. కొన్ని బంద్ చేసైనా నిధుల్ని తీసుకోవాలె.

## లోకం పోకడ




# డయల్ 100కి ఫోన్ చేయండి

- **ప్రభుత్వమే సహాయంచేస్తుంది**
- **నేటినుంచి రాత్రి కర్ఫ్యూ.. పూర్తిగా అమలు**
- **వైద్యులను, పోలీసులను కాపాడుకోవాలి**
- **ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపు**
- **మీడియాను ఆపొద్దని అధికారులకు ఆదేశాలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా సాయంత్రం ఏడు నుంచి మరుసటి ఉదయం 6 గంటలవరకు పూర్తిస్థాయి కర్ఫ్యూ విధిస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఒక్క మనిషి కూడా ఇల్లు వదిలి బయటకు రావొద్దని హెచ్చరించారు. మంగళవారం ప్రగతిభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఎట్ ఎనీ కాస్ట్. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా 100కు ఫోన్ చేయండి. మీ ఇంటి దగ్గరికే వాహనం వస్తది మీకు సాయం చేస్తది. కానీ, మనిషి వీధిలోకి వస్తే చాలా కఠిన చర్యలుంటయ్. బతిమిలాడే పరిస్థితి ఉండదిక. నిన్నటిదాకా పోలీసులు దండాలు పెట్టి చెప్పిన్రు. ఇక దండాలు అందుకోవాల్సి ఉంటుంది. షాపులు సాయంత్రం ఆరుగంటల వరకే క్లోజ్ చేయాలి. ఏడు వరకూ ఉండకూడదు. ఆరుకే పూర్తిచేసుకొని ఏడు గంటల్లోపు ఇండ్లకుచేరాలి. ఆరు గంటల ఒక్క నిమిషానికి షాపు తెరిచి ఉంచినా షాపును క్లోజ్ చేస్తాం. స్ట్రిక్ట్ యాక్షన్ తీసుకుంటాం. అనుమతించిన పనులు ఏమిటంటే.. గ్రామాల్లో వ్యవసాయం జరగాలి.. పాలు పితకాల్సిందే. పొలానికి నీళ్లు పెట్టేవారు పెట్టాల్సిందే. పండిన పంటను కోయాల్సినవాళ్లు కోయాల్సిందే. లేకపోతే ధాన్యం మన చేతికి రాదు. తిండిగింజలు లేకుండా అవుతుంది. కాబట్టి, గ్రామీణ ప్రాంతాల్లో జరగాల్సిన వ్యవసాయ పనులను ప్రభుత్వం అనుమతిస్తుంది. ప్రస్తుతం యాభై లక్షల ఎకరాల్లో పంటలున్నయ్. అదంతా వస్తేనే తిండిగింజలు దొరుకుతాయి. అవి కూడా గుంపులుగుంపులుగా చేయకూడదు. నరేగా పనులు కొనసాగించవచ్చు. నీటిపారుదల ప్రాజెక్టు పనులు దూరంగా జరుగుతున్నాయి కాబట్టి వాటిని కొనసాగించవచ్చు. లేబర్ క్యాంపుల వద్ద హై శానిటైజేషన్‌కు చర్యలు తీసుకుని వారి ఆరోగ్యాన్ని కాపాడాలి.

### పల్లెలు కంచె వేసుకొన్నాయి

చాలా గ్రామాలు సరిహద్దుల్లో కంచెలు వేసుకొన్నాయి. మేం వేరే ఊరికి రాము.. మా ఊరికి వేరేవారు రావొద్దంటున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ప్రాంతాలు కంట్రోల్లోకి వచ్చినాయి. భగవంతుడి దయ వల్ల ఇప్పటికి వ్యాధి కంట్రోల్లోనే ఉన్నది. మరీ ఎక్స్‌పాండ్ అవ్వడం లేదు. ఇయ్యాల లోకల్గా ట్రాన్స్‌మిట్ అయిన ఒక్క కేసు కూడా రాలేదు. ఇయ్యాల వచ్చినది కూడా ఫారిన్ కేసే. ఇప్పుడు కత్రా తలాయించింది. ఎయిర్‌పోర్టులు, రైళ్లు బందయినయి. రాత్రి నుంచి డొమెస్టిక్ ఫ్లైట్లు బందవుతయి. వేరే దేశం నుంచి, వేరే రాష్ట్రంనుంచి జబ్బు వచ్చే అవకాశమే లేదు. మన వద్దకు ఫారిన్ రిటర్నుల ద్వారా చేరిన జబ్బు వ్యాప్తి కాకుండా కాపాడుకోవాలి. రాష్ట్రంలో కరోనా ఎక్కువమందిలో లేదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియదు. దీన్ని ఇట్లనే నియంత్రించగలిగితే తెలివికలోళ్లమవుతం. ప్రాణాల్ని కాపాడుకుంటాం. రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుంటాం. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావు మనుమరాలి పెండ్లికి నలభై వేల పెండ్లి పత్రికలను పంచినారు. ఈ సిట్యుయేషన్‌ని చూసి పెండ్లి వాయిదా వేసుకున్నారు. నేను ఆయన్ని అభినందిస్తున్నాను. జిల్లా కలెక్టర్లు, పోలీసుశాఖ, వైద్యశాఖ, మున్సిపల్, గ్రామాల్లో శానిటేషన్ విభాగం అద్భుతంగా పనిచేస్తున్నాయి. ప్రపంచమంతా పరేషాన్‌లో ఉన్నది కాబట్టి డాక్టర్లు ఎగ్జాస్ట్ కాకూడదు. దండంపెట్టినా నలుగురు డాక్టర్లు రారు. ఉన్న డాక్టర్లను కాపాడుకొంటూ వారు అలసట చెందకుండా ఆరోగ్యశాఖ మంత్రి, కార్యదర్శి చర్యలు తీసుకొంటున్నారు. పోలీసులు ఎగ్జాస్ట్ కాకూడదు. మెట్రోరైలు సేవల్లో ఉన్న పోలీసుల సేవలను వినియోగించుకుంటాం. ఉన్న ఫోర్సును డీజీపీ షిఫ్టులవారీగా డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఈ శాఖ ఎగ్జాస్ట్ అయితే మనల్ని కాపాడేవారు ఎవరూ ఉండరు. శాంతిభద్రతలను రక్షించేవారు ఎవరూ ఉండరు. కాబట్టి, వీళ్లను రక్షించుకోవాలి.



సంగారెడ్డి జిల్లాలోని శంకోల్లాపూర్ గ్రామ సరిహద్దులో ముళ్లకంచెవేసిన గ్రామస్థుల స్ఫూర్తిని వెల్లడిస్తున్న సీఎం కేసీఆర్

### మీడియాను ఆపొద్దు

నిన్న ఒకట్రెండుచోట్ల పోలీసులు, జర్నలిస్టులకు గొడవ జరిగినట్లు తెలిసింది. అది మంచిది కాదు. పోలీసులకు చెప్తున్నా. ప్రభుత్వమే జర్నలిస్టులకు అనుమతిచ్చింది. వాళ్లతో దురుసుగా ప్రవర్తించొద్దు. డీజీపీకి ఆదేశాలు జారీచేసినం. డీజీపీ కూడా పోలీసులకు ఆదేశాలిస్తరు. జర్నలిస్టులు అపార్థం చేసుకోవద్దు. ఉద్దేశపూర్వకంగా ఎవరూ అట్లచేయరు. ప్రభుత్వమే జర్నలిస్టులకు అనుమతిస్తూ కచ్చితమైన ఆదేశాలు జారీచేసింది. మీడియా ద్వారా ప్రజలకు వార్తలు పోవాలి. నేను చెప్పే మాటలు ప్రజలకు పోవాలన్నా మీడియా కావాలి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు చెప్పే విషయాలు ప్రజలకు పోవాలంటే మీడియా ఫ్రీగా తిరగాలి. వాళ్లు ఎక్కువమంది కూడా పోరు. మనం పిలిస్తే తప్ప గుంపులుగా రారు. పోలీసులు సంయమనం పాటించాలి. ఎట్టి పరిస్థితుల్లో మీడియా పట్ల ఘర్షణ వైఖరిగానీ, ఆపే పరిస్థితిగానీ ఉండొద్దు. ఈ ఆపత్కాల పరిస్థితుల్లో మీడియా కూడా దానిని పెద్దగా చేయొద్దని మనవిచేస్తున్నా. ఎక్కడైనా చర్యలు తీసుకోవాల్సి ఉంటే డీజీపీ తప్పకుండా చర్యలు తీసుకుంటరు. మినహాయింపు జాబితాలో మీడియా ఉంది. వాళ్లు వార్తలు సేకరిస్తరు, మన కోసమే, సమాజం కోసమే పనిచేస్తరు. అందుకే వారిని ఫ్రీగా వదలండి. వారి పట్ల పోలీసులెవరూ దురుసుగా ప్రవర్తించొద్దు.

### మనల్ని మనమే నిర్బంధించుకుందాం

కరోనా విషయంలో రష్యా అద్భుతంగా దేశాన్ని కాపాడుకుంటున్నది. రష్యా అధ్యక్షుడు వాళ్ల ప్రజలకు ఒక్కమాటే చెప్పిండు... దర్జాగా కాలు మీద కాలేసుకుని ఇంట్లో ఉండాలంటే ఉంటలేరు... వీధుల్లోకి వస్తున్నరు. బయటికొస్తే ఐదేండ్లు జైల్లో పెడుతమని చెప్పిండు. ఇంట్లో ఉండదలుచుకున్నరా.. ఐదేండ్లు జైల్లో ఉండదలుచుకున్నరా... ఏదో ఒక నిర్ణయం తీసుకోండి, అది మీ చాయిస్ అని చెప్పడంతో అంతా బంద్ అయింది. తెలంగాణ బిడ్డగా ప్రజలందరికీ రెండు చేతులు జోడించి చెప్తున్నా. ఇది ఎవరి కోసమో కాదు. ఎవరో మిమ్మల్ని నిర్బంధించడం కాదు. మనల్ని మనమే నిర్బంధించుకోవాలి. మన కోసం.. మన బతుకు కోసం.. మన పిల్లల కోసం.. మన రాష్ట్రం కోసం కచ్చితంగా ఉన్నతాధికారులు చెప్పేది పాటించాలి. సీఎస్, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులకు నిద్రలు ఉంటలేవు. టైం టు టైం చూస్తున్నరు. సివిల్ సప్లయ్, బ్లాక్‌మార్కెట్, ఎవరేం చేస్తున్నరనేది ప్రతీ క్షణం పర్యవేక్షిస్తున్నరు. వాళ్లకు ఆ టైం సరిపోతలేదు. ప్రజాప్రతినిధులు పౌరబాధ్యత నిర్వర్తించాలి. బ్లాక్ మార్కెట్లు నడవకుండా చూడాలి. ప్రజలకు నిత్యావసర వస్తువులు మంచిగా అందాలి. మీ పరిధిలో చేయాల్సిన బాధ్యతను నిర్వర్తించాలి. రాష్ట్రాన్ని ఈ మహమ్మారి నుంచి కాపాడటంతో విజయం సాధించాలి.

# పంటల్ని కొంటాం

- **రైతులు బెంబేలెత్తవద్దు**
- **పట్టణాలకు రావొద్దు.. ఊళ్లోనే అమ్ముకోవాలి..**
- **ముఖ్యమంత్రి కేసీఆర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో లాక్‌డౌన్ ఉన్నంతమాత్రాన పండిన పంటల గురించి రైతులు బెంబేలెత్తవద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మంగళవారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ 'మక్కజొన్న పంట కానీ వరిపంట కానీ ప్రభుత్వమే కొంటది. రైతాంగం బెంబేలెత్తాల్సిన అవసరం లేదు. కనీస మద్దతు ధర చెక్కుల ద్వారా మీ బ్యాంకు ఖాతాలో వేస్తరు. ఎట్టి పరిస్థితుల్లో టౌన్‌లలో ఉండే మార్కెట్ కమిటీలకు రావొద్దు. వాటిని బందు పెడుతున్నం. మిమ్మల్ని అక్కడికి రానివ్వరు. మీ ఊర్లోనే మీరు అమ్ముకోవాలి. ఇందుకు తగినన్ని కొనుగోలు కేంద్రాలను అక్కడే ఏర్పాటుచేస్తున్నాం. ఎవరు ఎప్పుడు తేవాలో తెలియజేసేందుకు ప్రత్యేకంగా కూపన్లిస్తారు. మార్కెట్, వ్యవసాయ సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలిచ్చాం. నిన్న (సోమవారం) వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి రివ్యూచేసి రిపోర్టు ఇచ్చారు. ఇందుకు సంబంధించి హైలెవెల్ కమిటీలో సమీక్షించాం. ఎవరి ఉత్పత్తులు వారివారి ఊర్లలోనే అమ్ముకోవడానికి, అక్కడే కొనుగోలు చేయడానికి ఐకేపీ సెంటర్లను పెంచుతున్నాం. సహకారసంఘాలను కూడా కొనుగోలు చేయాలని చెప్తున్నాం. ఆ ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయి. రైతుబంధు సమితులు కూడా యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేయాలి' అని సీఎం కేసీఆర్ కోరారు.



సత్య నాదెళ్ల సతీమణి అనుపమ తరఫున సీఎం కేసీఆర్‌కు రూ.2 కోట్ల విరాళం చెక్కు అందజేస్తున్న ఆమె తండ్రి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేఆర్ వేణుగోపాల్



సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ పక్షాన ఒకరోజు మూలవేతనం రూ.48 కోట్ల అంగీకారపత్రాన్ని అందజేస్తున్న జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



సీఎం కేసీఆర్‌ను కలిసి రూ.10లక్షల చెక్కు అందజేస్తున్న సినీ హీరో నితిన్

# కరోనా కట్టడికి భారీ విరాళాలు

- సత్య నాదెళ్ల సతీమణి రూ.2 కోట్లు
- సినీహీరో నితిన్ రూ.10 లక్షల చెక్కు అందజేత
- ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు విరాళాల ప్రకటన
- ఒకరోజు వేతనంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల అనుమతిపత్రం
- ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్



సీఎం కేసీఆర్‌కు రూ.2.50 లక్షల చెక్కును అందజేస్తున్న తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌ను కలిసి ఒకరోజు వేతనం రూ.16కోట్ల అనుమతిపత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్ రెడ్డి, కమలాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తిచెందకుండా, లాక్‌డౌన్ సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకుల సరఫరా కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి పలువురు పెద్దఎత్తున విరాళాలు ప్రకటిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల సతీమణి అనుపమ నాదెళ్ల.. సీఎం సహాయనిధికి రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును అనుపమ తండ్రి మాజీ ఐఏఎస్ అధికారి కేఆర్ వేణుగోపాల్.. మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. సినీ హీరో నితిన్ రూ.10 లక్షలు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రూ.10లక్షల చొప్పున చెక్కులను ప్రగతిభవన్‌లో కేసీఆర్‌కు అందించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తన రెండు నెలల జీతాన్ని, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఒకనెల జీతాన్ని సీఎం సహాయ నిధికి అందజేయనున్నట్టు తెలిపారు. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి రెండునెలల వేతనం రూ. 5 లక్షలను విరాళంగా ఇచ్చారు. ప్రభుత్వవిప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు రూ.3.82 లక్షలు, ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ రూ.2.5 లక్షలు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి నెల వేతనం రూ.2.5 లక్షల చెక్కును సీఎం కేసీఆర్‌కు అందించారు. ములుగు జెడ్పీచైర్మన్ కుసుమ జగదీశ్వర్ నెలవేతనం రూ.లక్ష ప్రకటించారు. విజయడెయిరీ నుంచి సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.5 లక్షలు అందజేయనున్నట్టు రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి పేర్కొన్నారు.


ఎమ్మెల్సీ నవీన్‌కుమార్



ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


జైపాల్‌యాదవ్


హరిప్రియా నాయక్


రేగా కాంతారావు


రాజాసింగ్


లోక భూమారెడ్డి

### ఉద్యోగసంఘాల ఒకరోజు వేతనం

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఒక రోజు మూలవేతనం రూ.48 కోట్లకు ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు కారం రవీందర్ రెడ్డి, మమత.. సీఎంకు అంగీకారపత్రం అందజేశారు. పీఆర్టీయూటీఎస్ సభ్యులు ఒక రోజు వేతనానికి సంబంధించి రూ.16 కోట్ల అనుమతిపత్రాన్ని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పింగలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు తదితరులు ముఖ్యమంత్రికి సమర్పించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ తరఫున ఒకరోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. తెలంగాణ గెజిటెడ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కూడా ఒకరోజు పెన్షన్‌ను విరాళంగా ఇస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు మోహన్ నారాయణ, ప్రధాన కార్యదర్శి నర్సరాజు ప్రకటించారు. ప్రభుత్వానికి తమవంతుగా సాయం చేసేందుకు విరివిగా విరాళాలు అందజేస్తున్న ప్రతిఒక్కరికీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

### సీఎం కేసీఆర్ చర్యలు ప్రశంసనీయం: బండి సంజయ్

కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయంగా ఉన్నాయని.. ప్రభుత్వ నిర్ణయాలను ప్రతిఒక్కరూ పాటించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. మంగళవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. నిత్యావసర వస్తువుల ధరలపై నియంత్రణ చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. కరోనా కట్టడి కోసం రూ.50 లక్షల నిధుల చెక్కును కరీంనగర్ కలెక్టర్‌కు అందజేశారు.




## ఆయురారోగ్యాలతో ఉండాలి

- రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం కేసీఆర్ ఉగాది శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, సీఎం కే చంద్రశేఖర్‌రావు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని సీఎం కేసీఆర్ భగవంతుడిని ప్రార్థించారు. ఉగాదిని తెలుగు ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటున్నట్టు గవర్నర్ తమిళిసై చెప్పారు.




## నిజామాబాద్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం ఉపఎన్నిక వాయిదా పడింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం.. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి మంగళవారం అధికారిక సమాచారమిచ్చింది. వాస్తవానికి ఈ ఉపఎన్నికకు వచ్చేనెల ఏడో తేదీన పోలింగ్ జరగాల్సి ఉన్నది.

## విద్యావాలంటీర్లకు జీతాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వపాఠశాలల్లో పనిచేస్తున్న విద్యావాలంటీర్లకు ప్రభుత్వం జీతాలను విడుదలచేసింది. ఈ మేరకు రూ. 31,61,59,000 మొత్తాన్ని విడుదలచేస్తూ మంగళవారం జీవో జారీచేశారు. దాదాపు 15 వేల మంది విద్యావాలంటీర్లకు జీతాలు అందనున్నాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.1500

- సన్నద్ధమవుతున్న పౌరసరఫరాలశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో లాక్‌డౌన్ నేపథ్యంలో తెల్లరంగు రేషన్‌కార్డుదారులకు ఒక్కొక్కరికి రూ.1500 నగదును వారివారి ఖాతాల్లో నేరుగా జమచేసేందుకు పౌరసరఫరాలశాఖ సన్నద్ధమవుతున్నది. రెండు, మూడురోజుల్లో వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకొంటున్నది. రాష్ట్రంలో ఉన్న 87.56 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉండగా.. తమ వద్ద ఉన్న బ్యాంకు అకౌంట్ల వివరాల మేరకు నగదు జమచేయాలని నిర్ణయించారు.

# దాస్తే దహిస్తుంది..

- నిర్లక్ష్యం వీడితే అందరూ క్షేమం
- విదేశాలనుంచి వచ్చారా?.. వివరాలివ్వండి
- బాధితులు, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అమెరికా నుంచి పదిరోజుల క్రితం ఓ యువకుడు నగరానికి వచ్చాడు. తన ఆరోగ్యం బాగానే ఉందనుకొని ఊరంతా ఎక్కడపడితే అక్కడ తిరిగాడు. మిత్రులతో పార్టీ చేసుకున్నాడు. కానీ వారంతర్వాత హఠాత్తుగా దగ్గు, జలుబు, జ్వరం మొదలైంది. ఈ విషయం బయటపడకుండా రెండురోజులు జాగ్రత్తపడ్డాడు. కానీ పరిస్థితి విషమించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మంగళవారం వెళ్లి గాంధీ దవాఖానలో చేరాడు. దీంతో అతని బంధువులు, మిత్రులు, ఆఫీసు సహచరులలో ఆందోళన మొదలైంది. శేరిలింగంపల్లిలోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో 39 ఏండ్ల మహిళకు కరోనా పాజిటివ్ వచ్చింది. ఆమె ఈ నెల 12న జర్మనీ నుంచి వచ్చారు. ఇంట్లోనే క్వారంటైన్‌లో ఉంటున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చందానగర్ సర్కిల్ వైద్య సిబ్బంది ఆమెను గాంధీ దవాఖానకు తరలించారు. ఆమె విదేశాల నుంచి వచ్చిన సంగతి అపార్ట్‌మెంట్ సంఘానికి తెలియదు. ఇప్పుడు గేటెడ్ కమ్యూనిటీ నివాసితులెవరినీ బయటకు రావొద్దని ఆంక్షలు విధించారు. ఇప్పుడు ఆమె ఇంటి చుట్టుపక్కలవారందరూ ఆందోళన చెందుతున్నారు. ఓ యువకుడు ఇటీవల దుబాయ్ నుంచి సాగర్ రోడ్డులోఉన్న తన గ్రామానికి వచ్చాడు. తెలిసినవారందరినీ కలిశాడు. అతడికి కరోనా పాజిటివ్ అని తేలింది. తాను దుబాయ్ నుంచి వచ్చిన విషయాన్ని ఆ యువకుడు అధికారులకు తెలియజేయలేదు. ఇప్పుడు అతని బంధువులు, మిత్రులలో టెన్షన్ మొదలైంది.



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కార్మికవాడలో పర్యటిస్తున్న వైద్యబృందం

### నిర్లక్ష్యం ఖరీదు ఎన్ని ప్రాణాలో!

ఓ వ్యక్తి నిర్లక్ష్యం తనకు మాత్రమే కాకుండా.. తన బంధువులు, మిత్రులు, సహచరుల ప్రాణాలకు కూడా ముప్పు తెస్తున్నది. ఆ వ్యక్తి స్వచ్ఛందంగా తన విదేశీ పర్యటనను అధికారులకు వెల్లడించి ఉంటే, అధికారులు సైతం అతనొక్కడిపైనే ప్రత్యేక శ్రద్ధచూపి జాగ్రత్తలు తీసుకునేవారు. అతని నిర్లక్ష్యం మూలంగా ఆ వ్యక్తి కలుసుకున్నవారందరినీ కనిపెట్టి వైద్య పరీక్షలు చేయాల్సి వస్తున్నది. ఇటువంటి అలసత్వమే ఇటలీ, స్పెయిన్ దేశాలలో వేల సంఖ్యలో ప్రాణాలను బలితీసుకుంటున్నది. వారి నిర్లక్ష్యమే యూరోపియన్, అమెరికన్ దేశాల్లో కరోనా కరాళనృత్యానికి కారణమవుతున్నది.

### జాడలేని 9వేల మంది

ఈ నెల ఒకటోతేదీ తరువాత విదేశాల నుంచి దాదాపు 20వేల మంది హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో కాలుమోపారు. వీరిలో సుమారు 11వేల మంది వివరాలను ప్రభుత్వం కనుక్కున్నది. మిగిలిన తొమ్మిదివేల మంది వివరాలను కనుక్కొనేందుకు ప్రయత్నిస్తున్నది. వీరి పాస్‌పోర్టుల్లో పాత చిరునామాలే ఉండటంతో వారి ఆచూకీ లభించడం లేదని తెలుస్తున్నది. పైన పేర్కొన్న అమెరికా యువకుడిలాగా వీరిలో ఏ కొంతమందికి కరోనా సోకినా నష్టం భారీగా ఉంటుంది. అందుకే విదేశాల నుంచి వచ్చినవారి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించాలి. ఈ నెల ఒకటో తేదీ తరువాత విదేశాల నుంచి వచ్చినవారి వివరాలను స్థానిక అధికారులకు తెలియజేయాలి. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడితే.. మన రాష్ట్రాన్ని పెను ఉత్పాతం నుంచి తప్పించవచ్చు.

### సమాచారమివ్వడమే రక్ష

మన ప్రాంతంలో, రాష్ట్రంలో ఇటువంటి ముప్పును నివారించాలంటే అందరూ అప్రమత్తమవ్వాలి. గత రెండువారాలలో విదేశాల నుంచి వచ్చినవారందరూ అధికారులకు స్వచ్ఛందంగా తెలియజేయాలి. వారు ఎంత ప్రియమైన బంధువైనా, ఆప్తమిత్రుడైనా, ఇరుగుపొరుగువారైనాసరే.. విదేశాల నుంచి వచ్చి ఉంటే.. మనమైనా వారి వివరాలను తక్షణమే అధికారులకు అందజేయాలి. కరోనా బాధితుల, అనుమానితుల, అలాగే వారి సమాచారమిచ్చినవారి వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతారు. ఈ విషయంలో భయపడాల్సిన అవసరమే లేదు. మనకెందుకులే అనుకున్నా.. మనవాళ్లే కదా అని అలసత్వం ప్రదర్శించినా.. వారితోపాటు అందరూ కరోనా మహమ్మారి బారిన పడాల్సి వస్తుంది.

TSRTC ఇ-వేలం వాయిదా ప్రకటన

''ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఇప్పుడున్న రాష్ట్ర జనతా కర్ఫ్యూ మూలంగా కరీంనగర్ స్టోర్సులో పనికిరాని వాహనములు, టైర్లు మరియు మెటీరియల్స్ అమ్మకమునకు 26-03-2020 నాడు జరుగవలసిన ఇ-వేలం వాయిదా వేయడమైనది. ఈ-వేలం జరుపబడు తేది తదుపరి తెలియజేయబడును.
No. PSOC II/1/3/2017-18
తేది: 23-03-2020
DIPR RO. No.1011-PP/CL/Advt/1/2019-20, Dt: 24-03-2020 సం/- చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజినీర్, చార్మినార్ జోన్
NIT No. 26/SE-CRZ/GHMC/2019-20 టెండరు ప్రకటన తేది: 24-03-2020
పని పేరు: 5 అవుట్ సోర్సింగ్ పనులు. అంచనా మొత్తం: రూ. 464.66 లక్షలు. బిడ్ల స్వీకరణ కొరకు ప్రారంభ తేది/చివరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 26-03-2020న సా. 5.00 గం. బిడ్ల స్వీకరణ కొరకు చివరి తేది & సమయం: 01-04-2020న మ. 3.15 గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నం: శ్రీ బి.నర్సింగ్‌రావు, సూపరింటెండింగ్ ఇంజినీర్, చార్మినార్ జోన్, GHMC, సర్దార్ మహల్ చార్మినార్. ఫోన్ 7207912667. తదుపరి వివరాలను https://tender.eprocurement.gov.inలో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, చార్మినార్ జోన్, GHMC
DIPR RO.No. 1012 PP/CL/Advt/1/2019-20, Dt: 24-03-2020

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
NIT.No. 43/SE(KZ)/GHMC/TA/2019-2020 తేది: 24-3-2020
పనిపేరు: ఔట్ సోర్సింగ్ ప్యాకేజ్ 4-1 పని (పునః పిలుపు) పూర్తి మొత్తం రూ.133.87 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ/ ఆఖరి తేదీ: బిడ్ దాఖలు ప్రారంభ, ముగింపు తేదీ: 24-3-2020న సా.4.00 గం. నుండి 26-3-2020న సా.4.00 గం. వరకు.
అధికారి చిరునామా సెల్ నం. SE(KZ) GHMC ఫోన్ నం. 8790522144.
తదుపరి వివరాలను www.eprocurement.gov.in వద్దగల ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (KZ) హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
DIPR RO No.1015PP/CL/Advt/1/2019-20, Dt: 24/3/2020

తెలంగాణ ప్రభుత్వము
వెటరినరీ మరియు యానిమల్ హజ్బెండ్రీ శాఖ
జాయింట్ డైరెక్టర్ (VAH) కార్యాలయం, TSVBRI హైదరాబాద్-28
సవరణ
Lr నం.107/FMD/TSVBRI/2019-20 తేది: 24-3-2020
పైన తెలిపిన నిర్దేశం ద్వారా TSVBRI, హైదరాబాద్‌లో సీనియర్ రీసెర్చ్ ఫెల్లో/ యంగ్ ప్రొఫెషనల్-II నియామకం తెలంగాణ రాష్ట్రంలో ప్రకటించిన లాక్‌డౌన్ కారణంగా వాయిదా వేయబడినది. సవరించిన తేదీ తర్వాత తెలియజేయబడుతుంది.
సం/- జాయింట్ డైరెక్టర్ (VAH) TSVBRI, హైదరాబాద్
DIPR RO No.2720-DP/CL/Advt/1/2019-20, Dt: 24/3/2020

ENDOWMENTS DEPARTMENT
ESTATE SHRI LAXMANJI MAHARAJ TEMPLE
NOTICE
It is hereby informed that due to the Covid-19 pandemic and the restrictions as per G.O.Ms.No.45 and 46 dated 22.03.2020 and 23.03.2020 respectively, the E Tender / Tender Cum Public Auction for Property bearing Survey No.58, situated at Raidurg Navakhalsa (V), Serilingampally (M), Ranga Reddy District, Telangana, scheduled for 27.03.2020 has been postponed. New date will be advertised as and when fixed.
Sd/- Navneet Pittie Muthwali & Hereditary Trustee

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.
ఇ-టెండరు ప్రకటన
బహిరంగ ప్రకటన నం. /7C/MD/52/CMP/Qtn/SC/2020, తేది: 24-03-2020. దిగువ తెలిపిన యూనిట్లకు 27-03-2020న 15.30 గంటల వరకు తగిన అనుభవంతో పేరొందిన మెడికల్ ఆఫీసర్ల నుండి నిర్ణీత ఫారాలలో భారత రాష్ట్రపతి తరఫున, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, మెడికల్ శాఖ, 1వ అంతస్తు, హెల్త్ యూనిట్ చిలకలగూడ, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దరఖాస్తులు కోరుతున్నారు.

| | |
|---|---|
| ప్రకటన నం. | C/MD/52/CMP/Qtn./SC/2020 తేది: 24-03-2020 |
| పని పేరు: | మూడు నెలల కాల వ్యవధి కొరకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన రైల్వే హెల్త్ యూనిట్లు VKB, BDCR & BPA వద్ద కాంట్రాక్టు మెడికల్ ప్రాక్టీషనర్స్‌ను నియోగించుట |

దరఖాస్తు నమూనా, నియమ నిబంధనలు మరియు పూర్తి వివరాలు ఈ ప్రకటనతోసహా జతచేయబడినవి మరియు అవి వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో అప్‌లోడ్ చేయబడినవి. తగు విధంగా పూర్తిచేసిన దరఖాస్తులను చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, 1వ అంతస్తు, రైల్వే హెల్త్ యూనిట్ చిలకలగూడ, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే కార్యాలయానికి దాఖలు చేయాలి.
A0457 చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సికింద్రాబాద్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్
కోర్ట్ కాంపౌండ్, సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాద్-500 003
ఆరోగ్య శాఖ
టెండరు ప్రకటన
Lr.No.SCB/HS/ETen/SecurityGuards/2020/654, తేది: 23-03-2020
1. దిగువ తెలిపిన పని యొక్క టెండరు పరిశీలించుట కొరకు అర్హతా ప్రమాణాలు నెరవేరుస్తూ ఇతర రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ శాఖలు/PSUలతో పనిచేస్తున్న అర్హత గల కాంట్రాక్టర్ల నుండి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కంటోన్మెంట్ బోర్డ్, సికింద్రాబాద్ - 500003 వారు దరఖాస్తులను తిరిగి కోరుచున్నారు:
సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కంటోన్మెంట్ ఫండ్ భవనాల యొక్క ఎంపిక చేసిన ప్రదేశాల వద్ద సెక్యూరిటీ గార్డ్స్ ఏర్పాటు చేయుట కొరకు వార్షిక కాంట్రాక్టు
(i) టెండర్ల (ఆన్‌లైన్) దాఖలుకు చివరి తేది : 03-04-2020న 15:00 గంటల వరకు
(ii) సాంకేతిక బిడ్ తెరుచు తేది : 04-04-2020న 15:00 గంటల తర్వాత
2. కాగోరు/ఆసక్తిగల కాంట్రాక్టర్లు వెబ్‌సైట్ "www.eprocure.gov.in/eprocure/app"ని చూడాల్సిందిగా కోరబడుచున్నారు.
ఇది ఇ-టెండరు, ఈ టెండరు కొరకు మాన్యువల్‌గా ఆఫరు చేయబడిన బిడ్లు ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించబడవు, ఎలక్ట్రానిక్ ఆఫర్ బిడ్లు మాత్రమే అంగీకరించబడతాయి. సవివర సూచనల కొరకు వెబ్‌సైట్‌ని చూడగలరు.
సం/- విజయ్ కుమార్ బాలన్ నాయర్
డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్

# అందుబాటులో ఆన్‌లైన్ డాక్టర్

- ఇంటినుంచే సంప్రదించే అవకాశం
- ప్రారంభించిన యశోద హాస్పిటల్స్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆన్‌లైన్ వీడియో డాక్టర్ కన్సల్టేషన్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని యశోద హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జీఎస్‌రావు వెల్లడించారు. కరోనా నేపథ్యంలో ఈ సదుపాయాన్ని కల్పించామని మంగళవారం తెలిపారు. అత్యావసర వైద్య సలహాల కోసం తమ వైద్యులను ఆన్‌లైన్ వీడియో కన్సల్టేషన్ ద్వారా సంప్రదించవచ్చని చెప్పారు. డయాబెటిస్, కిడ్నీ, గుండె వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు స్థిరమైన సమీక్ష, వైద్యుల సలహా అవసరమన్న విషయాన్ని తాము అర్థం చేసుకున్నామని పేర్కొన్నారు. రోగులకు నిరంతరం మార్గనిర్దేశం చేయడానికి ఆన్‌లైన్ వైద్య సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప రోగులు ఇల్లు వదిలి బయటకు రావద్దని చెప్పారు. ఆన్‌లైన్ కన్సల్టేషన్ పొందడానికి www.yashodahospital.com వెబ్‌సైట్, లేదా 040-45674567 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.



డాక్టర్ జీఎస్ రావు, ఎండీ, యశోద హాస్పిటల్స్

# కరోనా చికిత్సకు ఔషధం తయారీ

- హైదరాబాద్ కేంద్రంగా పరిశోధనలు
- సిప్లా సహకారంతో నాలుగు నెలల్లో మార్కెట్లోకి

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మానవాళి మనుగడకే సవాలు విసురుతూ.. ప్రపంచమంతటా మృత్యుఘంటికలు మోగిస్తున్న కరోనా మహమ్మారిని అరికట్టే ఔషధం తయారీకి హైదరాబాద్ కేంద్రంగా పరిశోధనలు మొదలయ్యాయి. ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ఆధ్వర్యంలో పరిశోధనలు సాగుతున్నాయి. ఈ పరిశోధనలకు తగిన సహకారం అందించేందుకు ప్రముఖ ఔషధ తయారీ సంస్థ సిప్లా ముందుకొచ్చింది. ఇప్పటికే క్లినికల్ ట్రయల్స్‌లో సానుకూల ఫలితాలు వచ్చిన కొన్ని డ్రగ్స్ సాయంతో ఔషధం తయారీకి ప్రయత్నిస్తున్నామని ఐఐసీటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. పదిమంది శాస్త్రవేత్తలు, మరో 30 మంది నిపుణులు ఈ పనిలో నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. ఎయిడ్స్, క్యాన్సర్ వంటి వ్యాధుల చికిత్సకు ఔషధాలను తయారుచేసిన ఐఐసీటీ ఈసారి కరోనా కట్టడికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. ఫెవిపిరవిల్, రెమిడిసవిర్, టెలాక్సివిర్ అనే డ్రగ్స్ కరోనాకు విరుగుడుగా పనిచేయవచ్చని ఐఐసీటీ ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చింది. ఈ డ్రగ్స్‌పై ఇప్పటికే క్లినికల్ ట్రయల్స్ నిర్వహించారు. అయితే మార్కెట్లో వీటి అవసరం రాకపోవడంతో వాటి ఉత్పత్తిని ప్రారంభించలేదు. ఈ డ్రగ్స్ పారిశ్రామిక స్థాయిలో టాబ్లెట్లు, ఇంజెక్షన్ల రూపంలో తయారుచేసి ఎటువంటి షరతులు లేకుండా మార్కెట్లోకి విడుదల చేయడానికి సిప్లా సిద్ధమవుతున్నది. నాలుగు నెలల్లోగా ఔషధాన్ని విడుదల చేయడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని చంద్రశేఖర్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. రెండు షిఫ్టుల్లో శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారని చెప్పారు. తాము ఔషధాన్ని తయారుచేసి సిప్లాకు అందిస్తామని, ఆ సంస్థ భారీస్థాయిలో వాటిని ఉత్పత్తి చేస్తుందని తెలిపారు.



చంద్రశేఖర్, డైరెక్టర్, ఐఐసీటీ

**1857**

సూర్యగ్రహణాన్ని మొదటిసారి ఫొటో తీసిన ఫ్రెడరిక్ లాగెన్ హేమ్.

# వేదిక



గత నలభై గంటల్లో ఒక్క కరోనా కేసు కూడా కొత్తగా నమోదు కాలేదు. అయినా కరోనాపై పోరాటం కొనసాగుతున్నది కనుక సంతోషపడాల్సిందేమీ లేదు. ఒకేసారి కేసులు పెరుగవచ్చు. మనం అప్రమత్తంగా ఉండాలి.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

## శార్వరికి స్వాగతం!

**నేడు** ఉగాది పర్వదినం, శార్వరి సంవత్సరాది. కొత్త వత్సరంలోకి అడుగు పెట్టడం అంటే ఆనందంతో పాటు ఉద్వేగం మిళితమై ఉంటుంది. భవిష్యత్తుపై ఆసక్తి, ఒకింత ఆందోళన. రాజపూజ్యం, అవమానం, ఆదాయం, వ్యయం మొదలైన అంశాలు తెలుసుకుంటూ ఉంటారు. జీవితమంతా ఒకేలా సాగదు. కొంత ఆశ, మరికొంత నిరాశ కూడా కలిసి ఉండవచ్చు. ఒక్కోసారి మనం బాధాకరం అనుకునేది నిజానికి సౌఖ్యంగా పరిణమించవచ్చు. అందుకేనేమో పూర్వీకులు తొలిరోజు ఉగాది పచ్చడి సేవనాన్ని ఆచారంగా పెట్టారు. జీవితమంటే షడ్రుచుల సమ్మేళనమనే తాత్త్వికతను బోధించారు. జీవితంలోని భిన్న కోణాలను గంభీరంగా స్వీకరించాలనే సందేశాన్ని అందించారు. ఈ తాత్త్వికతను అర్థం చేసుకుంటే ఒడిదొడుకులను ఎదుర్కొని నిలువగల మానసిక స్థైర్యం నెలకొంటుంది. ఈ సానుకూల దృక్పథంతోనే నూతన సంవత్సరం శార్వరికి స్వాగతం పలుకుదాం. అనేక విజయాల మధ్య, కరోనా చేదు అనుభవాలను మిగులుస్తూ వికారి వీడ్కోలు తీసుకున్నది. శార్వరి తీపిని పంచుతుందనే ఆకాంక్షతో, కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుదాం. కొత్త ఏడాదిలో కోరిన విధంగా జీవితాన్ని తీర్చిదిద్దుకుందాం.

ఉగాది అనగానే తెలంగాణ మేధోసంపత్తి గుర్తుకువస్తుంది. శాలివాహన శకమనే కాలగణనను ప్రపంచానికి కానుకగా అందించినది మన సమాజమే. కాలగణన మేధావులకే పరిమితమైంది కాదు. దుక్కిదున్ని విత్తనాలు వేసే రైతన్నలకు కూడా పంచాంగమే ప్రామాణికం. ఈ పంచాంగమే ఇరుగు పొరుగు రాష్ట్రాలకు, దేశ సరిహద్దులు దాటి తూర్పు ఆసియాకు చేరింది. స్వాతంత్ర్యానంతరం జాతీయ కాలగణనగా గుర్తింపు పొందింది. మానవ నాగరికత ప్రతి దశలోనూ తెలంగాణ భాగస్వామ్యం ఉన్నది. కళా సాహిత్యరంగాల్లోనైనా, విజ్ఞానంలోనైనా తెలంగాణ తన వెలుగును నలుదెసలా ప్రసరించింది. ప్రపంచంలో తొలి గణతంత్రాలుగా ప్రసిద్ధికెక్కిన షోడష జనపదాల్లో మన తెలంగాణలోని అశ్మక జనపదం కూడా ఒకటి. గోదావరి, కిన్నెరసాని గలగలల లయకు దీటుగా శిలలపై ఉలి నాట్యమాడుతుంటే, శిల్పకళ పురుడు పోసుకున్నదిక్కడే. సాంచి స్థూప తోరణాల సొబగులు అద్దినది తెలంగాణ శిల్పులే. వందేండ్ల కిందటే ఆధునిక వేధశాలను నిర్మించుకొని, అంతరిక్షాన్ని కొలిచిపెట్టిన ఘనత మనది. భవిష్యత్తులోకి అడుగుపెట్టే ముందు గతాన్ని తలుచుకొని, ధైర్యంగా ముందడుగు వేద్దాం.

ఉగాది షడ్రుచులను ఒకేసారి ఆస్వాదించడం మన జీవన తాత్త్వికతకు నిదర్శనం. చరిత్ర యావత్తూ తెలంగాణ జాతి ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసింది. సామ్రాజ్య కేంద్రంగా వెలిగింది, పరాయి పాలన చీకటిలోనూ మగ్గింది. కష్ట సుఖాలు మనకు కొత్త కాదు. విజయాలకు విర్రవీగిందీ లేదు, కష్టాలకు కుంగిపోయిందీ లేదు. తెలంగాణ అంటేనే ఉత్తమ జీవన విధానం. సాత్వికత, సమష్టి తత్త్వం ఉట్టిపడుతుంది. బతుకమ్మ చప్పట్లు, పాల పిట్టల దర్శనాలతో, పండుగలు పబ్బాలు సామూహికంగా జరుపుకొనే మహోన్నత సంస్కృతి మనది. కానీ కాలం మనకొక విషమ పరీక్షను పెట్టింది. కరోనా వైరస్ మన ఉనికినే సవాలు చేస్తున్నది. ఇంద్రజిత్తు మాదిరిగా కంటికి కనిపించని మాయా యుద్ధం సాగిస్తున్నది. ఇతర దేశాల అనుభవాలు భయంకరంగా ఉన్నాయి. కరోనా ఇప్పటికే లక్షలాదిమందిని చేరింది. ఇతర దేశాలు అనుభవిస్తున్న క్షోభ నుంచి మనం గుణపాఠాలు నేర్చుకుందాం. ఆ మహమ్మారి మనలను తాకకుండా అతిజాగ్రత్తగా ఉందాం. కొంతకాలం పాటు ఇంటికే పరిమితం కావాలనే సామూహిక నిర్ణయం తీసుకుందాం. కాలం పెట్టిన కరోనా పరీక్షను దిగ్విజయంగా ఎదుర్కొందాం. శార్వరి సంవత్సరాన్ని అతి మధురంగా మార్చుకుందాం.

# తెలంగాణతనమే తరుణోపాయం



స్పీచ్

తన్నీరు హరీశ్‌రావు

ట్యాంక్‌బండ్‌పై సాగరహారం గుర్తుందా? పుట్టలు పగిలి చీమలు వచ్చినట్లు.. ఎక్కడెక్కడినుంచో జనం తరలివచ్చారు. అప్పట్లో మన నాయకుడు ఒక్క పిలుపు ఇచ్చాడంతే.. ఆ చివర ఉన్న ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల నుంచి, ఈ చివర ఉన్న ఖమ్మం నుంచి కూడా జనం తండోపతండాలుగా తరలివచ్చారు. పోలీసులు అడ్డుకుంటారేమోనని ముందురోజు రాత్రే హైదరాబాద్ చేరుకున్నారు. పోలీసులు అరెస్టులు చేస్తుంటే.. ఒక బ్యాచ్ తర్వాత మరొక బ్యాచ్‌గా బయటికి వచ్చారు. పోలీసులకు చుక్కలు చూపించి మరీ సాగరహారాన్ని విజయవంతం చేశారు. అప్పట్లో మన రాష్ట్రాన్ని మనం సాధించుకోవాలంటే బయటికి రావాలి. ఉల్లంఘనలను ఛేదించుకొని మరీ బయటికి రావాలి. అందుకే వచ్చాం. కానీ, ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నమైనది. మన రాష్ట్రాన్ని, మన కుటుంబాలను కాపాడుకోవాలంటే ఇప్పుడు బయటికి రాకూడదు.

**తెలంగాణలో** ఒక్క ప్రాణం కూడా అన్యాయంగా బలయిపోకూడదంటే బయటికి రాకూడదు. ప్రభుత్వం విధించిన ఉల్లంఘనల కట్టు దాటకూడదు. అప్పట్లో పోలీసు ఆంక్షలను దాటితే విజయం. ఇప్పుడు పోలీసులు ఆంక్షలు దాటితే పరాజయం. అప్పట్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే సంతోషం. ఇప్పుడు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే విషాదం. అందుకే, బయటికి వచ్చి ఏ స్థాయి విజయం సాధించగలమో చూపించిన మనం.. ఇప్పుడు బయటికి రాకుండా కూడా అదేస్థాయిలో తెలంగాణతనాన్ని చూపించాల్సిన తరుణం ఇది. ఇంట్లోనే ఉండి ప్రపంచంపై విజయం సాధించాల్సిన సమయం ఇది.

**అసలు మన దాకా వస్తుందా?**

ఎక్కడో చైనాలో పుట్టిన కరోనా వైరస్ మనకెందుకు వస్తుంది? విదేశాలకు వెళ్లివచ్చిన వారికి అయితే సరే కానీ.. ఇక్కడ ఎందుకు వస్తుంది? ఇవి చాలామందికి వస్తున్న ప్రశ్నలు. అత్యధికుల్లో నిర్లక్ష్యానికి కారణం కూడా ఇదే. కానీ, ఇప్పుడు ప్రపంచం అంటే వివిధ దేశాల సమూహం కాదు. అన్నింటినీ కలిపేసిన ఓ కుగ్రామం. దాదాపు ప్రతి ఊరి నుంచీ పదిమందో, పదిహేను మందో అమెరికాలో ఉంటున్నారు. ప్రతి గ్రామం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉంటున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉంటున్నది. జర్మనీ, స్పెయిన్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో ఉంటున్నవారి సంఖ్య కూడా ఎక్కువే. ప్రతిరోజూ ఆయా దేశాల నుంచి ఊర్లకు మనవాళ్లు వస్తూనే ఉన్నారు. ఇక్కడ మనం గుర్తించాల్సిన ముఖ్య విషయం కరోనా సోకితే దాదాపు ఐదురోజుల వరకూ బయటపడదు. ఆ తర్వాత చలిజ్వరం వంటి లక్షణాలే ఉంటాయి. దాంతో, విదేశాల నుంచి వచ్చినవాళ్లు యథావిధిగా ఇంట్లో, బయట తిరిగేస్తున్నారు. గల్ఫ్ దేశాల నుంచి ఓ వ్యక్తి వచ్చాడు. వచ్చినందుకు దావత్ ఇచ్చాడు. మనమంతా వెళ్లాం. అతనికి ఏ లక్షణాలూ లేవు. కానీ, అంతా కలిసి తిన్నాం, తాగాం. బంధువుల పెళ్లికి వెళ్లాం. దోస్తు గృహ ప్రవేశానికి కూడా వెళ్లివచ్చాం. ఓ ఐదు రోజుల తర్వాత అతనికి కరోనా పాజిటివ్ వచ్చిందని అనుకుందాం. అప్పుడు.. అప్పటివరకూ అతనితో తిరిగిన మనకు కూడా ప్రమాదమే కదా. ఎక్కడో చైనాలో పుట్టిన ఆ వైరస్ మన ఊరికి కూడా వచ్చేసినట్టే కదా. విదేశాల నుంచి వచ్చి న వ్యక్తి ఒక్కడికే కరోనా వస్తే అతడు ఒక్కడినే దవాఖానలో ఉంచి చికిత్స చేస్తారు. దానివల్ల, పెద్దగా వచ్చిన ప్రమాదం కూడా లేదు. కానీ, అతని కారణంగా కుటుంబసభ్యులకు, దోస్తులకు వచ్చిందనుకోండి.. ముప్పు రెట్టింపవుతుంది. అదే, దోస్తుల ద్వారా దోస్తుల కుటుంబాలకు, ఊరోళ్లకు వచ్చిందనుకోండి.. దాన్ని కంట్రోల్ చేయడం మన తరం కాదు. గతంలో కలరా, మశూచి వ్యాపించినట్లు ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపించేస్తుంది. ఊర్లకు ఊర్లను చుట్టబెట్టేస్తుంది. వేలు, లక్షల సంఖ్యలో రోగులు తయారవుతారు. ఈ ప్రమాదాన్ని ఊహించే సీఎం కేసీఆర్ నెలాఖరు వరకూ అంతా ఇంట్లోనే ఉండాలని నిర్బంధం విధించారు.

**ఇంట్లో ఉండలేమా?**

కరోనా నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి మన కుటుంబాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవడానికి మనం కొన్నిరోజులు సంయమనంతో ఉండలేమా? తెలంగాణను సాధించుకోవడానికి ఆరు దశాబ్దాల పాటు ఎంతో ఓపికతో ఎదురుచూసిన మనం ఒక్క పదిరోజుల పాటు అదే ఓర్పును చూపలేమా? ఇది మనం అక్షరాలా చేసి చూపించగల కార్యం. కలిసికట్టుగా పనిచేయగల సంఘటితత్వం మన సొంతం. తెలంగాణ ఉద్యమమే దానిని మనకు నేర్పింది. 'జనతా కర్ఫ్యూ' అయినా 'లాక్ డౌన్' అయినా విజయవంతం కావడానికి ఇదే కారణం. ఉద్యమ సమయంలో కేసీఆర్ అనేక పిలుపులు ఇచ్చారు. నాయకుడు ఒక పిలుపునిస్తే దాన్ని ఎలా ఆచరించి చూపాలో అప్పట్లోనే మనం నేర్చుకున్నాం. ఉదాహరణకు, ఉద్యమ సమయంలో సభలు,



సమావేశాలకు లక్షల్లో జనం స్వచ్ఛందంగా వచ్చేవారు. ఎవరో చెప్పినట్లు ఎంతో క్రమశిక్షణతో సభలో ఉండేవారు. సభ అయిపోయిన తర్వాత ఎక్కడా ట్రాఫిక్‌జామ్‌కు అవకాశం ఇవ్వకుండా, ఎక్కడా ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అత్యంత జాగరూకతతో సురక్షితంగా ఇళ్లకు వెళ్లిపోయేవారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా కేసీఆర్ పిలుపునిస్తే తూచా తప్పకుండా అమలుచేస్తున్నారు. ఇందుకు కారణం.. కేసీఆర్ మన కోసమే చెబుతాడనే నమ్మకం. తెలంగాణ శ్రేయస్సు కోసమే చెబుతాడనే విశ్వాసం. అందుకే, దేశంలో ఎక్కడా లేనట్లు తెలంగాణలో జనతా కర్ఫ్యూ విజయవంతమైంది. ఇంత సంయమనాన్ని, సాధనాశక్తిని మనకు ఉద్యమమే ఇచ్చింది. మనమంతా కలిసికట్టుగా ఒక పనిచేసే ఐక్యతా బలాన్ని కూడా ఉద్యమమే ఇచ్చింది. ఇదిప్పుడు మాత్ర మే కాదు.. రాష్ట్రం వచ్చిన తర్వాత పలు సందర్భాల్లో రుజువైంది కూడా. ఇప్పుడు మనమంతా మరొకసారి సంఘటితంగా స్పందించాల్సిన సమయం వచ్చింది. మన ఐక్యతా శక్తిని, తెలంగాణతనాన్ని చూపించాల్సిన తరుణం ఆసన్నమైంది. కరోనా ప్రమాదాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ అందరికంటే ముందు స్పందించారు. సమీక్షలు జరుపుతూ ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు ఇస్తూ ఉన్నారు. 'లాక్ డౌన్' విధిస్తే నిరుపేదల పూట గడవడం ఎలా? ఈ విషయాన్ని కూడా అందరికంటే ముందే సీఎం కేసీఆర్ గుర్తించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెల్లకార్డు దారులకు కుటుంబానికి రూ.1500, కుటుంబంలో ప్రతి ఒక్కరికీ 12 కేజీల చొప్పున బియ్యం అందజేస్తున్నారు. నెలలు నిండిన గర్భిణులకు ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉందని గుర్తించి.. వారి వివరాలను సేకరించడమే కాదు, వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు. ఇటువంటి నాయకత్వం ఉండటం మన అదృష్టం. నాయకుడు చెప్పిన మాటను తూచా తప్పకుండా పాటించడం మన కర్తవ్యం.

**నాకేమవుతుందిలే అనే నిర్లక్ష్యం వద్దు**


కరోనా ఈరోజు ప్రపంచాన్ని వణికిస్తున్నది. దాదాపు 192 దేశాల్లో వైరస్ అనేకమందికి సోకి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. నిన్నటివరకూ మన దేశంలో కూడా ఇతర దేశాల నుంచి వచ్చినవారికి మాత్రమే ఆ వైరస్ సోకింది. కానీ, ఇప్పుడు మన దేశంలో ఉన్న వారికి కూడా ఈ వ్యాధి సోకడం ప్రారంభమైంది. దానికి ఇంతవరకూ వ్యాక్సిన్ లేదు. దానికి ఉన్నదల్లా ఒక్కటే.. అదే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం. నేను మీ అందరినీ కోరేదొక్కటే. ప్రభుత్వం సూచించినవిధంగా ముందు జాగ్రత్తచర్యలు అందరూ పాటించండి. అత్యవసరమైతే తప్ప ఇళ్లల్లోంచి బయటికి రాకండి. నిత్యావసరాలు, మందులు వంటి అత్యవసరాలు కావాల్సి వస్తే ఇంటినుంచి ఒక్కరు మాత్రమే వచ్చి సమీపంలోనే కొనుక్కొని తిరిగి వెంటనే ఇంటికి చేరాలని కోరుతున్నాను. దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు వంటివి వస్తే వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లండి. మిమ్మల్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం అన్నిచర్యలూ తీసుకుంటున్నది. సీఎం కేసీఆర్ స్వయంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సీఎం కేసీఆర్ సూచించిన విధంగా ఈనెల 31వ తేదీ వరకూ ప్రజలు ఎవరూ వీధుల్లోకి రావద్దు. నాకేమవుతుందిలే అనే నిర్లక్ష్య ధోరణి వద్దే వద్దు. నిర్లక్ష్యం కారణంగానే ఈరోజు ఇటలీలో ప్రతిరోజూ పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ముసలివాళ్లంతా చనిపోతున్నారు. ఇటలీకి పట్టిన గతి మన దేశానికి, మన రాష్ట్రానికి పట్టవద్దంటే అది మీ చేతుల్లోనే ఉన్నది. ఇంట్లోనే ఉండండి. సురక్షితంగా ఉండండి. ఒకరినుంచి మరొకరికి వ్యాపించే ఈ గొలుసుకట్టును ఛేదించడం ద్వారా మాత్రమే ఈ కరోనాను మనం కట్టడి చేయగలుగుతాం. ఇంత చెప్పిన తర్వాత కూడా వినకుండా, ప్రభుత్వ ఆజ్ఞలను ఎవరైనా ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తారు. అవసరమైతే కేసులు పెడుతారు. చివరికి జైలుకు కూడా పంపాల్సి వస్తుంది. సైన్యాన్ని కూడా పిలువాల్సి వస్తుందని ముఖ్యమంత్రి ఆవేదన చెందుతున్నారు. ఆ పరిస్థితి తెచ్చుకోవద్దు. దయచేసి పోలీసులకు సహకరించండి. ప్రభుత్వం ఇస్తున్న సూచనలను ఎప్పటికప్పుడు వింటూ వాటిని ఆచరణలో పెట్టండి.

**(వ్యాసకర్త: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి)**

# కనపడని శత్రువుతో యుద్ధం

ప్రస్తుతం సమస్త మానవాళిని కలవరపరుస్తున్నది కరోనా అనే మూడక్షరాల పదం. సాధారణంగా, ఈగలు, దోమలు, లేదా ఇతర క్రిమికీటకాల ద్వారా అంటువ్యాధులు వ్యాపిస్తాయి. ఈ కరోనా అనే మాయరోగం మాత్రం మనుషుల నుంచి మనుషులకు పాకుతుంది. ఈ విలక్షణ తత్వమే ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధిపట్ల ప్రజల భయాందోళనలు ఒక స్థాయికి మించి ప్రబలడానికి కారణమైంది. పనిచేసే ప్రభుత్వం కావాలని అందరం కోరుకుంటాం. అయితే ప్రభుత్వం 'నిశ్శబ్దంగా పనిచేస్తోంద'ని ఎవరైనా అంటే ఓ పట్టాన నమ్మం. ఇది మానవ మనస్తత్వం.

విశ్లేషణ



భండారు శ్రీనివాసరావు

**'ఈ వ్యాధి** మహమ్మారిలా చుట్టుముడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది' అనేది ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా వినబడే మాట. ఈ మాటలు అనేవాళ్లు ముందు అర్థం చేసుకోవాల్సిందొక్కటే. ఎవరూ ఈ వ్యాధి రావాలని కోరుకోలేదు. ఎక్కడో చైనాలో పుట్టి రోజుల వ్యవధిలోనే ప్రపంచమంతటా విస్తరించింది. ప్రభుత్వాల అలసత్వం వల్లనో, నిర్లక్ష్యం వల్లనో ఈ కరోనా వ్యాధి మన దేశంలో పురుడు పోసుకోలేదు. విదేశాల నుంచి వచ్చిన వారి ద్వారానే ఈ వ్యాధి మన దేశంలో కాలుమోపింది.

ఈ కరోనా ఎలా పోతుందో తెలియదు. విరుగుడేమిటో అసలే తెలియదు. అరికట్టడానికి ఆ అవకాశమూ లేదు. ఇతరేతర వ్యాధులు ప్రబలినప్పుడు బాసటగా బంధుమిత్రులు వుంటారు. చికిత్స చేయడానికి ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు అనేకం అందుబాటులో ఉంటాయి. వ్యాక్సిన్లు, మందులుంటాయి. కానీ కరోనా విభిన్నం. ఈ వ్యాధి సోకిన లేదా అనుమానం ఉన్న రోగిని బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా వారిని ఐసోలేషన్ గదుల్లో ఉంచాలి. మొదటి రెండు దశల్లో వ్యాధిని గుర్తించి చికిత్స చేయగలిగితే ప్రాణహాని ఉండదు. కానీ మూడో దశకు చేరుకుంటే ఇక ఆ రోగిని కాపాడటం కష్టమంటున్నారు వైద్యులు. మిగిలిన వ్యాధులు వ్యాపించినప్పుడు బాహ్య ప్రపంచమంతా మామూలుగానే ఉంటుంది. రైళ్లు, బస్సులు, కార్లు విమానాలతోసహా అన్నీ మామూలుగా రాకపోకలు సాగిస్తాయి. ఆర్థికవ్యవస్థపై ప్రభావం అతిస్వల్పంగా ఉంటుంది. అదే కరోనా విషయం వేరు. ఈ వైరస్ అతి త్వరితంగా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. అందుచేత ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే స్వచ్ఛంద స్వీయ గృహ నిర్బంధం మినహా మరో దారి లేదు. అందుకే, ఆర్థికవ్యవస్థ కుప్పకూలిపోయే పెను ముప్పు ఓ పక్క పొంచి ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు సాహసం చేసి లాక్‌డౌన్ ప్రకటిస్తున్నాయి. ప్రజలు ఒకరినుంచి మరొకరికి ఈ వ్యాధిని సంక్రమింపజేసే ప్రమాదం ఉన్నందున, కర్ఫ్యూ వంటి తీవ్రమైన చర్యలను అమలుచేయాల్సిన పరిస్థితి దాపురించింది. మరో ప్రమాదకరమైన విషయమేమంటే ఈ రోగం శరీరంలో ప్రవేశించిన రెండు వారాల వరకు గుర్తించడం సాధ్యం కాదు. ఇప్పటివరకు బయటకు వచ్చిన సమాచారాన్ని బట్టి విదేశాల నుంచి వచ్చిన వారివల్లనే ఈ వ్యాధి వ్యాపిస్తున్నదని తెలుస్తున్నది. వ్యాధి సోకినవారినందరినీ ఇప్పుడు వెతికి పట్టుకొని పరీక్షలు చేయాల్సిన బృహత్తర కార్యక్రమం ప్రభుత్వాపై పడింది. ఇది సాధారణ విషయం కాదు. సముద్రపు ఒడ్డున ఇసుకలో పడిపోయిన సూదిని వెతకడం వంటిది. అయినా ప్రభుత్వం వెనుకాడటం లేదు.

శాంతా బయోటిక్ వ్యవస్థాపకులు వరప్రసాదరెడ్డి ఒక టీవీ ఇం టర్వ్యూలో చెప్పారు. వారి అమ్మాయి కేరళ నుంచి హైదరాబాద్ వచ్చారు. ఇటీవల ఒక వైద్య బృందం వారి ఇంటికి వెళ్లి ఆవిడ ఆరోగ్యం గురించి విచారించి తగిన పరీక్షలు చేసి, కరోనా వ్యాధి లక్షణాల్లేవని నిర్ధారించుటకు వెళ్లిందట. ప్రభుత్వం తీసుకుంటున్న జాగ్రత్తలు చూసి ఆయన ఆశ్చర్యపోయారట. అలాగే హైదరాబాద్ నగరంలోని హఫీజ్‌పేటలో ఉన్న ఒక కాలనీకి అధికారుల బృందం వెళ్లింది. పలానా పేరు కలిగిన వ్యక్తులు పలానా రోజున, పలానా దేశం నుంచి వచ్చి మీ కాలనీలో ఉంటున్నారు, వారికి తక్షణం పరీక్షలు చేయాలని కాలనీ అధ్యక్ష, కార్యదర్శుల ను అడిగితే వాళ్లు నివ్వెరపోయారట. విదేశాల నుంచి ఎవరు వచ్చారో అప్పటిదాకా వారికే తెలియదు. వెళ్లిచూస్తే అది నిజమని తేలింది. వెంటనే ఆ వ్యక్తులకు పరీక్షలు చేసి వారిని స్వీయ గృహనిర్బంధంలో ఉండాలని చెప్పారట. అప్పటినుంచి ప్రతిరోజూ ఫోన్‌లో వారిని సంప్రదించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేస్తున్నారట. గత పదిహేను రోజుల్లో వివిధ దేశాల నుంచి వేల మంది హైదరాబాద్ వచ్చి ఉంటారు. అలా వచ్చిన వాళ్లు కార్లలోనో, బస్సుల్లోనో, రైళ్లలోనో తమ గమ్యస్థానాలకు వెళ్లి ఉంటారు. ఈ క్రమంలో వారిలో ఎవరికైనా ఈ వ్యాధి సోకి ఉంటే అది ఇతరులకు అంటుకునే ప్రమాదం ఉన్నది. కానీ ఆ 'ఇతరులు' ఎవరని గాలించి కనిపెట్టడం సామాన్యమైన విషయం కాదు. నగరాలూ, పట్టణాలు, గ్రామాలు ఇలా అన్నిచోట్లా ప్రభుత్వ యంత్రాంగం అలా వచ్చిన వారి కోసం జల్లెడ పట్టి గాలిస్తున్నది.

కాబట్టి ప్రభుత్వం ఏం చేస్తోందని మెటికలు విరిచేవాళ్లు ఈ విషయాలను గమనంలో ఉంచుకోవాలి. ఈ వ్యాధిని అరికట్టడమన్నది ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో లేదు. సమస్త ప్రజానీకం సహకరించినప్పుడే కరోనాను అడ్డుకోవడం సాధ్యమవుతుంది. అదే ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా చెబుతున్నారు. అదే ప్రభుత్వాధికారులూ చెబుతున్నారు. అనవసరంగా రోడ్ల మీద తిరుగవద్దంటున్నారు. ఇంటిపట్టునే ఉండమంటున్నారు. నిత్యావసర వస్తువుల కొరత లేకుండా చూస్తామంటున్నారు. కొద్దిరోజులు ఓపిక పడితే పరిస్థితి సర్దుకుంటుందని కూడా చెబుతున్నారు. వినడం మనందరి ధర్మం! ఎందుకంటే ఈ మహమ్మారిని అరికట్టగలిగిన సులువైన పని మన చేతుల్లోనే ఉంది. మన చేతల్లోనే ఉంది. ■

## మనిషి దేవుడని ప్రకటిద్దాం!!

ఇప్పుడు
చేయిచేయి కలపడం కన్నా
చేతుల్ని శుభ్రంగా కడుక్కోవడమే ముఖ్యం
దగ్గరవ్వడం కన్నా
కాస్తంత దూరంగా ఉండడమే మేలు



దేహాలు
దూరమైనంత మాత్రాన
మనసులు దూరమైపోవు కదా??

కంటికి కనబడనిదేదో
మనకు తెలియకుండానే దేహంలోకి చొరబడి
ఊపిరి తీసేస్తుందన్నప్పుడు
నీకు నువ్వూ నాకు నేనూ బందీగా ఉండటమే మంచిది

కనబడే శత్రువైతే
ఎదురుపడి పోరాటం చేయొచ్చు
కనబడని శత్రువుతో ఎట్ల??



సాగుతున్న మృత్యువు క్రీడలో
మనిషే మనిషికి తోడుండాలి
మనిషే మనిషికి అండై నిలబడాలి
మనిషే మనిషికి దేవుడవ్వాలి

రండి..
ఇవ్వాలనే కాదు
ప్రతిరోజూ 'అతడికి' చప్పట్లుకొట్టి మనసారా అభినందిద్దాం
మనిషే దేవుడని నిర్భయంగా ప్రకటిద్దాం!!

- బిల్ల మహేందర్
91776 04430

## శ్రీ శార్వరి!





శ్రీ వికారి వీడుకోలు
ఆకారమంత వికారం గాదని
భాష్యాలెన్నో చెప్పేసుకొని
లెక్కకు చిక్కని మిక్కిలి తిక్కలు
బుద్ధికి అందని నూతన తిప్పలు
మేధకు లొంగని వైరస్సు దెత్తులు
ధరిత్రి చుట్టూరా కమ్మటం కన్నాం!
శ్రీ శార్వరి సుస్వాగతం
కృష్ణపక్షపు రాత్రిలో
తుహినకరుడు తరిగినటు
క్రమంగా బుద్ధిని హరించక
శుక్లపక్షపు శార్వరిలో
వెన్నెల అతిశయించినట్లు
మనో వికాసం విస్తరిస్తూ
మధుమాసపు తరుల తీరు
విరబూసే విరుల తీరు
శ్రావ్యపు కూతల కోకిలల తీరు
ప్రాభాత మయూఖాల వెల్గుల తీరు
ప్రాణకోటి మనుగడుండేనని
చైత్రపు విరుల నెత్తావులల్లే
మలయమారుతపు మంచిగంధమల్లే
శుభఘడియల్ని చుట్టూ చుట్టుకుని
జగత్తుకు వరప్రదాతమయ్యేవని
వినమ్రంగా నమస్కరించి ప్రార్థిస్తూ
ఆహ్వానమమ్మా ఆహ్వానం
శ్రీ శార్వరి!! శ్రీ శార్వరి!!




- రవి కిశోర్ పెంట్రాల
లాంగ్లీ, లండన్

# శ్రీ సదానందో విజయతే..



నమస్తే.. నమస్తే.. నమః



శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి

**అఖిల** ప్రపంచం అఖండానంద స్వరూపమే. అయినా ఆనందానుభూతి పొందుతున్నామనే కేవల భావనతోనే జీవిస్తుంటుంది. 'ఆనందం' అనేది ఏమిటనే అంశమే అత్యంత ఆలోచనీయం. కేవలానుభూతి ప్రధానమైన ఆ విషయం అనిర్వచనీయం కూడా. అవ్యక్తం, అనిర్వచనీయం, అనుభూతి, ఆనందం మొదలైన పదాలను విడివిడిగా చూడటం కుదరదు. అంతర్లీనంగా అవన్నీ ఒకటే. సహజంగా సచ్చిదానందమనే పదసముచ్ఛయాన్ని వాడుతుంటాం. సత్ చిత్, ఆనందములనే ఈ మూడు పదాలను వివరణగా చూస్తే, 'సత్' అనేది సర్వత్రా వ్యాపించి ఉంటుంది. 'చిత్' మౌనంగా ఉనికిని తెలుపుతుంది. ఆనందం ఈ రెండింటికీ కన్నతల్లి లాంటిది.

'శర్కర' అనే పదార్థాన్ని తీసుకుంటే తెల్లగా ఉండటం, వాసన లేకపోవడం మొదలైనవి దాని లక్షణాలు. ఇవి కేవలం బాహ్యలక్షణాలు. కానీ 'తీపిదనం' ప్రధాన లక్షణం కదా! జ్ఞానేంద్రియాల ద్వారా, కర్మేంద్రియాల ద్వారా, మనస్సు ద్వారా అనుభూతి కలిగేవి సత్, చిత్‌లు. అయితే, ఈ రెండింటికీ అతీతమైన విషయమే అనుభవైక వేద్యము కదా! అదే 'ఆనందం'. దీనినే 'రసము' అనికూడా అంటారు. ఈ 'రసము' ఎవరిద్వారా ఉత్పన్నమౌతుంది? ఎవరిద్వారా వృద్ధి పొంది ఎవరిని అలరిస్తుంది. చివరికి ఏమౌతుంది? అనే విశ్లేషణను అనేకులు అనేక విధాలుగా చర్చించినారు. అసలు ఆనందాన్ని అనుభవించిన వారికి మాత్రమే అది అభివ్యక్తమవుతుంది. ప్రపంచంలోని వస్తుజాలములను నిస్పృహతో, నిరీహగా చూసి ఔదాసీన్యాన్ని పూర్తిగా అభ్యసించిన సాధకునికైనా 'ఆనందం' అనేది విషయంలో లేదు, నిస్పృహాదులలో లేదు, అది 'దానిగానే' ఉన్నదని తెలుస్తుంది. ఇవన్నీ అవరోధాలు మాత్రమే అని కూడా తెలుస్తుంది.

జ్ఞానవికాసం అయినంతటనే ఏ విషయాన్నికూడా వస్తుబుద్ధితో దర్శించడం జరగదు. ఆనంద చక్షువులతో చూడడం జరుగుతుంది. వాస్తవబుద్ధి కలుగుతుంది. అంతటా ఒకే స్వరూపంగా కనిపిస్తుంది. అనుభవానికి, చూడటానికి, వస్తువుకు, ఇంద్రియాలకు మధ్యలోని అంతరం అంతమై అంతటా ఆనందమే భాసిస్తుంది. సముద్రంలోని అలలను చూసిన వ్యక్తికి ఆ అలలు వేరే పదార్థం కాదనీ, నీరే అలలని తెలిస్తే ఇక అలలు కల్లలుగానే లేదా కలగానే తోస్తాయి కదా! దీనికోసం సాధన అవసరం. ఆ సాధన సక్రమంగా జరగాలి. సదాచారం, స్నేహం, సహాయం, సంయమనం, సేవ ఇవన్నీ సంతోషాన్ని ఎల్లప్పుడూ అనుభవించేందుకు సహకరించే అంశాలు. ఇవి ప్రాథమిక అంశాలు. ఇంకా సాధన చతుష్టయ సంపత్తి చాలా అవసరం. అంటే, నిత్యానిత్య వస్తు వివేకం, శమాది షట్కసంపత్తి, ఇహాముత్రాఫలభోగ విరామం, ముముక్షుత్వం ఇవే సాధనకు కీలకాలైన అభ్యాస సంపదలు. ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో, ఏది మంచి, ఏది చెడు, ఏది



యదార్థం, ఏది అబద్ధం ఇలా వడబోసి చూసే తెలివి పేరు నిత్యానిత్య వస్తువివేకం, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం, గురువాక్యాన్ని ఆచరించడం. తృప్తిని కలిగి ఉండడం, ఎదిగిన స్థాయిలోనే నిలబడి ఉండడం కోసం తగిన ఓరిమి కలిగి ఉండడంతో పాటు శీతోష్ణ సుఖదుఃఖాలను ప్రతీకారరహితంగా అనుభవించడం, ఆనందస్థాయిలోనే వ్యవహరించడం వీటిని 'శమాది షట్కసంపత్తి' అంటారు.

సాధనవల్ల వచ్చే ఇహలోక, పరలోక సుఖాలపట్ల ఆసక్తి ఉండకపోవడమే ఇహాముత్రార్థ ఫలభోగ విరామం. పై మూడింటి ద్వారా స్థిరీకరణమైన చిత్తంతో బంధ, మోక్షాలను విచారించుకొని మోక్షాసక్తితో ఉండటం పేరు ముముక్షుత్వం. వీటిని అన్నింటినీ విస్తృతంగా పరిశోధించి ఆచరించాలి. వస్తుభ్రాంతిని వదిలి వాసుదేవస్థితి పొందేందుకు అహరహం ప్రయత్నించాలి. మాటలలో చెబితే ప్రయోజనం లేదు. ఆచరణ చేసి చూడాలి, చేవ చూపాలి. వాచా వేదాంతం పనికిరాదు. అనుష్ఠాన వేదాంతమే ఆచరణీయం. అంతటా పరమాత్మను దర్శించేందుకు సాధనయే బహుళాదరణీయం 'సాధనాత్ సాధ్యతే సర్వమ్' కదా !

# భారత్‌తో సాధ్యమే!

- కరోనాను ఎదుర్కొనే శక్తిసామర్థ్యాలున్నాయి
- పోలియో, మశూచిని జయించి ప్రపంచానికే మార్గం చూపింది
- ప్రపంచ ఆరోగ్య సంస్థ కితాబు



వైరస్ వేగంగా వ్యాపిస్తోంది: టెడ్రోస్

**జెనీవా:** కరోనాను ఎదుర్కోవడంలో భారత్ చేపడుతున్న అసాధారణ, కఠిన చర్యలను ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయి. గతంలో పోలియో, మశూచి (స్మాల్‌పాక్స్) వంటి పెద్ద మహమ్మారులను జయించిన భారత్ ప్రపంచానికే మార్గం చూపిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కితాబిచ్చింది. ఈ నేపథ్యంలో కరోనా మహమ్మారిని ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలన్నీ భారత్‌కు ఉన్నాయని డబ్ల్యూహెచ్‌వో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైకేల్ ర్యాన్ తెలిపారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు ఆదివారం దేశవ్యాప్తంగా 'జనతా కర్ఫ్యూను' ప్రజలంతా కలిసి విజయవంతం చేసిన నేపథ్యంలో సోమవారం జెనీవాలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జనాభాపరంగా ప్రపంచంలోనే రెండో అతి పెద్ద దేశమైన భారత్‌కు కరోనాను ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలున్నాయన్నారు. 1977లో మశూచిని పూర్తిగా అరికట్టిన భారత్, 2014లో పోలియో రహిత దేశంగా నిలిచింది.

కరోనా వేగంగా వ్యాప్తిస్తున్నదని డబ్ల్యూహెచ్‌వో అధిపతి టెడ్రోస్ అధనోమ్ ఆందోళన వ్యక్తం చేశారు. 'గత ఏడాది డిసెంబర్‌లో చైనాలో పుట్టిన కరోనా శరవేగంతో వ్యాపిస్తున్నది. 67 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా తొలి దశలో లక్ష మందికి వైరస్ సోకింది. అనంతరం రెండో దశలో 11 రోజుల్లోనే మరో లక్ష మందికి వ్యాపించింది. మూడో దశలో కేవలం నాలుగు రోజుల్లో మరో లక్ష మందికి వైరస్ సోకింది. 15 వేలకుపైగా మరణించారు' అని టెడ్రోస్ పేర్కొన్నారు. చాలా దేశాల్లో వెలుగులోకిరాని కేసులు పెద్ద సంఖ్యలోనే ఉండవచ్చన్నారు. అయినా కరోనా వ్యాప్తి కట్టడి సాధ్యమేనని భరోసా ఇచ్చారు. కరోనా వ్యాప్తిని తప్పించుకోవడం (డిఫెండింగ్ ) మాత్రమే సరిపోదని, ఫుట్‌బాల్ క్రీడ మాదిరిగా డిఫెండింగ్‌తోపాటు అటాక్ చేయాల్సి ఉందని, ఆ మేరకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

### 'జనతా కర్ఫ్యూ' స్ఫూర్తిదాయకం: అమెరికా

**వాషింగ్టన్:** భారత్ చేపట్టిన 'జనతా కర్ఫ్యూ' స్ఫూర్తిదాయకమని అమెరికా ప్రశంసించింది. ప్రధాని మోదీ పిలుపుతో ఆదివారం దేశవ్యాప్తంగా 'జనతా కర్ఫ్యూ'ను విజయవంతం చేయడం, డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఇతర సహాయక సిబ్బందికి చప్పట్లతో సంఘీభావం ప్రకటించడం స్ఫూర్తిదాయకమని దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల సహాయక కార్యదర్శి ఆలీస్ జీ వెల్స్ ట్విట్టర్‌లో ప్రశంసించారు. అమెరికాలోని భారత రాయబారి తరంజిత్ సింగ్ సంధు సోమవారం అక్కడి భారతీయ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భారతీయ కంపెనీలు స్థానిక ప్రజలకు ఎంతో అండగా ఉంటున్నాయని కొనియాడారు.

# అమెరికా.. కల్లోలం

## 24 గంటల్లో 16,354 కొత్త కేసులు నమోదు

- నాలుగు రాష్ట్రాల్లో పరిస్థితి విషమం
- ప్రపంచవ్యాప్తంగా 18 వేలు దాటిన కరోనా మృతుల సంఖ్య
- బ్రిటన్ లాక్‌డౌన్.. థాయిలాండ్‌లో ఎమర్జెన్సీ

**వాషింగ్టన్/ లండన్/ బ్యాంకాక్/ పారిస్, మార్చి 24:** ప్రాణాంతక కరోనా మహమ్మారి ఆట కట్టించేందుకు ప్రపంచ దేశాలు త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ అదే స్థాయిలో వైరస్ వ్యాపిస్తున్నది. ఆసియాలోని చైనాలో పుట్టిన ఈ వైరస్.. యూరప్‌లోని ఇటలీలో స్వైర విహారం చేసింది.. తాజాగా అగ్రరాజ్యం అమెరికాను అతలాకుతలం చేస్తున్నది. సోమవారం నుంచి 24 గంటల్లో యూరప్ అంతటా 20,131 నూతన కేసులు బయట పడితే, కేవలం అమెరికాలోనే కొత్తగా 16,354 మందికి వైరస్ సోకిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అధికార ప్రతినిధి మార్గరేట్ హారీస్ చెప్పారు. ఇప్పటి వరకు అమెరికా అంతటా 49,594 మందికి కరోనా పాజిటివ్ అని వైద్య పరీక్షల్లో తేలింది. గత 24 గంటల్లో తొలిసారి 130 మందికిపైగా మృత్యువాత పడటం అమెరికాను కలవరానికి గురి చేస్తున్నది. ఆ దేశంలో మొత్తం మరణాలు 622కి చేరాయి. న్యూయార్క్‌లో 157 మంది వైరస్‌తో మరణించారు. సోమవారం 5,085 కేసులతో కలిపి 20,875 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. వైద్య పరికరాలు, ఔషధాలతోపాటు హ్యాండ్ శానిటైజర్లు, ఫేస్ మాస్కులు తదితర వ్యక్తిగత రక్షణ పరికరాల కృత్రిమ కొరతను నిరోధించడానికి, వ్యాపారులు వాటిని ఎక్కువ ధరలకు విక్రయించకుండా నిలువరించేందుకు రూపొందించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు.

**షట్‌డౌన్‌తో తీవ్ర పర్యవసానాలు: ట్రంప్**
కరోనా వైరస్ కట్టడికి దేశమంతా 'షట్‌డౌన్' ప్రకటించాలన్న వైద్యుల సూచనను అమలు చేయడానికి వ్యతిరేకం అని ట్రంప్ చెప్పారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన పర్యవసానాలను ఎదుర్కొంటుందన్నారు. ప్రపంచం మొత్తం ఏండ్లుగా లాక్‌డౌన్ ప్రకటించినా తాము ఆ పని చేయమన్నారు. కరోనా నివారణలో కీలకంగా భావిస్తున్న క్లోరోక్వీన్ ఔషధ నిల్వలను సేకరించడంపై దృష్టిని కేంద్రీకరించామన్నారు. ఆసియా అమెరికన్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ట్రంప్ చెప్పారు. ఇంతకుముందు కరోనా వైరస్‌ను 'చైనీస్ వైరస్' అని ట్రంప్ పేర్కొన్న తర్వాత ఆసియా దేశాలకు చెందిన అమెరికన్లపై దాడుల నేపథ్యంలో ఇలా స్పందించారు. అమెరికాలో న్యూయార్క్, వాషింగ్టన్, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్ రాష్ట్రాలపై వైరస్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఆ రాష్ట్రాల పరిధిలో సైన్యాన్ని రంగంలోకి దించారు. బ్రిటన్‌లో కొత్తగా 54 మంది మృతితో మొత్తం మరణాలు 422కి, వైరస్ బాధితుల సంఖ్య 8,077కి చేరుకున్నది. బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ దేశంలో 3 వారాలు లాక్‌డౌన్ ప్రకటించారు. థాయిలాండ్‌లో మరణాలు నాలుగుకు చేరాయి. దీంతో గురువారం నుంచి నెల రోజులు అత్యవసర పరిస్థితిని విధించినట్లు ఆ దేశ ప్రధాని ప్రయుథ్ చాన్ ఓచా చెప్పారు.



న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో ఓ దవాఖాన వద్ద కరోనా పరీక్షల కోసం బారులుతీరిన అమెరికన్లు

### 4.08 లక్షల మందికి వైరస్

196 దేశాల్లో కరోనా మరణాలు 18,260కి చేరాయి. 4,08,913 మందికి కరోనా వైరస్ సోకిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తెలిపింది. ఇటలీలో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. శనివారం రికార్డు స్థాయిలో 793 మంది, ఆదివారం 651, సోమవారం 601, మంగళవారం 743 మంది మరణించారు. మొత్తంగా 6,820 మంది చనిపోగా 69,176 మందికి వైరస్ సోకింది. చైనాలో కొత్తగా 78 పాజిటివ్ కేసులు రికార్డు కాగా, ఏడుగురు మృత్యువాత పడగా మొత్తం 3,277 మంది మరణించారు. స్పెయిన్‌లో 2800, ఇరాన్‌లో 1934, ఫ్రాన్స్‌లో 860 మంది మృత్యువాతపడ్డారు. ఐస్‌లాండ్‌లో తొలి మరణం, మయన్మార్‌లో తొలి కేసు నమోదైంది. పశ్చిమాసియాలో 1966, లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల్లో 112 మరణాలు సంభవించాయి.

### కరోనా క్లాక్ 24-3-2020

ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు: 4.08 లక్షలు
మరణాలు: 18,260

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| చైనా | 81,171 | 3,277 |
| ఇటలీ | 69,176 | 6,820 |
| అమెరికా | 49,594 | 622 |
| స్పెయిన్ | 39,676 | 2,800 |
| జర్మనీ | 32,781 | 156 |
| ఇరాన్ | 24,811 | 1,934 |
| ఫ్రాన్స్ | 19,856 | 860 |
| స్విట్జర్లాండ్ | 9,117 | 112 |
| దక్షిణ కొరియా | 9,037 | 120 |
| యూకే | 8,077 | 422 |
| నెదర్లాండ్స్ | 5,560 | 276 |
| బెల్జియం | 4,269 | 122 |

దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు: 536
మరణాలు: 10

| | | |
|---|---|---|
| కేరళ 95 | మహారాష్ట్ర 89 | తెలంగాణ 39 |
| కర్ణాటక 37 | ఉత్తరప్రదేశ్ 33 | గుజరాత్ 33 |
| రాజస్థాన్ 32 | ఢిల్లీ 30 | పంజాబ్ 29 |
| హర్యానా 28 | తమిళనాడు 15 | లడఖ్ 13 |
| ప. బెంగాల్ 9 | ఏపీ 8 | మధ్యప్రదేశ్ 7 |

## కరోనా ఎఫెక్ట్

### రాజ్యసభ ఎన్నికలు వాయిదా

**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో ఈనెల 26న జరుగాల్సిన రాజ్యసభ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తెలిపింది. పలు రాష్ట్రాల పరిధిలో 55 స్థానాల భర్తీకి ఇటీవల నామినేషన్ ప్రక్రియ పూర్తైంది. 37 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 18 స్థానాలకు ఈనెల 26న ఎన్నికలు జరుగాల్సి ఉన్నది. మరోవైపు, మహారాష్ట్రలోని ధూలే-కమ్-నందుర్‌బర్, తెలంగాణలోని నిజామాబాద్ శాసనమండలి స్థానాల ఉప ఎన్నికలు కూడా వాయిదాపడ్డాయి.




### పుణె నుంచి తొలి కరోనా పరీక్షల కిట్

**మహారాష్ట్ర:** భారత్‌లోనూ కరోనా పరీక్షల కిట్‌లు అందుబాటులోకి రానున్నాయి. తమ టెస్టింగ్ కిట్‌లకు 'సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్' నుంచి వాణిజ్య ఆమోదం లభించిందని పుణెకు చెందిన మై ల్యాబ్ డిస్కవరీ సొల్యూషన్స్ సంస్థ తెలిపింది. కాగా, కరోనా పరీక్షల నిర్వహణకు 16 ప్రైవేట్ ల్యాబ్‌లకు అనుమతి లభించింది.

### వైద్య, పారిశుద్ధ్య సిబ్బందికి తమిళనాడు సర్కార్ నజరానా

**చెన్నై:** తమిళనాడులోని ప్రభుత్వ దవాఖానల్లో కొవిడ్-19 రోగులను కాపాడేందుకు ప్రాణాలను పణంగా పెట్టి చికిత్స అందజేస్తున్న వైద్యులకు, నర్సులకు, పారామెడికల్ సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం నజరానా ప్రకటించింది. వీరందరినీ నెలరోజుల ప్రత్యేక వేతనంతో గౌరవించనున్నట్టు ముఖ్యమంత్రి కే పళనిస్వామి మంగళవారం తమిళనాడు శాసనసభకు తెలిపారు.



### 14 వరకు రైల్వే సేవలు బంద్

**న్యూఢిల్లీ:** మూడు వారాలపాటు భారత్ లాక్‌డౌన్ నేపథ్యంలో ప్యాసింజర్ రైళ్ల సర్వీసులపై వచ్చే నెల 14 వరకు నిషేధం కొనసాగుతుందని రైల్వే ప్రకటించింది. మరోవైపు, కరోనాపై పోరాటానికి అవసరమైన వస్తువుల తయారీకి దేశవ్యాప్తంగా ఉన్న తమ ఉత్పత్తి యూనిట్ల జనరల్ మేనేజర్లను రైల్వేబోర్డు పురమాయించింది. మంచాలు, మెడికల్ ట్రాలీలు, క్వారంటైన్ వసతులు, ఐవీ స్టాండ్లు, స్ట్రెచర్లు, వాష్ బేసిన్లు, మాస్కులు, శానిటైజర్లు వంటివి తయారీకి చర్యలు తీసుకోవాలని కోరింది.

### డచ్ ఆరోగ్యశాఖ మంత్రిగా ప్రతిపక్ష ఎంపీ

**ఆమ్‌స్టర్‌డ్యాం:** నెదర్లాండ్స్ (డచ్) ప్రధాని మార్క్ రుట్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కరోనా వ్యాప్తిని నిరోధించడంలో చేయూతనిచ్చేందుకు ప్రతిపక్ష లేబర్ పార్టీకి చెందిన ఎంపీ, ఆరోగ్య నిపుణుడు మార్టిన్ వాన్ రిన్‌ను ఆరోగ్యశాఖమంత్రిగా నియమించారు.



నిత్యం భక్తులతో కిటకిటలాడే ఉత్తరప్రదేశ్‌లోని త్రివేణి సంగమం కరోనా ప్రభావంతో మంగళవారం వెలవెలబోయిన దృశ్యం

# 536 కేసులు నమోదు

- దేశవ్యాప్తంగా మరో 68 కేసులు
- 10 మందికి చేరిన మృతుల సంఖ్య

**న్యూఢిల్లీ, మార్చి 24:** దేశంలో కరోనా కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మంగళవారం కొత్తగా మరో 68 కేసులు నమోదు కావడంతో కేసుల సంఖ్య 536కి చేరింది. వీరిలో 43 మంది విదేశీయులు. వ్యాధి బారిన పడ్డ వారిలో 40 మంది కోలుకున్నారు. ఈ వైరస్ బారిన పడి మహారాష్ట్రలో తాజాగా మరొకరు మరణించారు. దీంతో ఈ మహమ్మారి వల్ల దేశవ్యాప్తంగా మరణించిన వారి సంఖ్య 10కి చేరింది. పలు రాష్ట్రాల్లో లాక్‌డౌన్ కొనసాగుతున్నా కొన్ని చోట్ల ప్రజలు రోడ్ల మీదకు రావడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తున్నది. ఎవరైనా లాక్‌డౌన్ ఆదేశాలను ధిక్కరించి రోడ్ల మీదకు వస్తే కర్ఫ్యూ విధించడానికి కూడా వెనకడుగు వేయవద్దని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. ఇక మహారాష్ట్రలో కరోనా తీవ్రత అధికంగా ఉన్నది. వైరస్ వల్ల ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఇద్దరు మరణించగా.. తాజాగా మరొకరు ప్రాణాలు కోల్పోయారు. మరణాల పరంగా చూస్తే మహారాష్ట్రలో-3, బీహార్, కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్, పంజాబ్, పశ్చిమబెంగాల్, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఒకొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు.

**సమీక్షలు.. ఆదేశాలు**

- కరోనా విస్తరించకుండా తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ అధికారులతో ఢిల్లీలో సమీక్ష నిర్వహించారు. వైరస్‌ను కట్టడి చేయడానికి మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
- కరోనాపై పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా అన్ని రాష్ట్రాలకు లేఖలు రాశారు.
- కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా కూడా అన్ని రాష్ట్రాల డీజీపీలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- రాష్ట్రాల్లోని పశువైద్యశాలలు, క్లినిక్‌లు సాధారణ విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది.
- కరోనా వైరస్ కట్టడిలో భాగంగా ఢిల్లీని లాక్‌డౌన్ చేయడంతో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా షాహీన్‌బాగ్‌లో ఆందోళనలు జరుపుతున్నవాళ్లు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### ఈశాన్య భారతానికి పాకిన కరోనా

**మణిపూర్‌లో తొలి కేసు నమోదు**

**ఇంఫాల్:** ఇప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ఈశాన్య భారతంలో తొలి కరోనా వైరస్ కేసు వెలుగు చూసింది. మణిపూర్ రాజధాని ఇంఫాల్‌కు చెందిన 23 ఏండ్ల యువతికి కొవిడ్-19 పాజిటివ్ లక్షణాలు కనిపించినట్టు మంగళవారం అధికారులు నిర్ధారించారు. బ్రిటన్‌లో చదువుకుంటున్న ఆ యువతి ఈ నెల 18న లండన్ నుంచి ఢిల్లీ మీదుగా కోల్‌కతా వెళ్లింది. అక్కడ మూడ్రోజులు ఉన్న తర్వాత సోదరుడితో కలిసి మణిపూర్‌కు వచ్చింది. ఇంటికి రాగానే శ్వాస సంబంధ సమస్యలు తలెత్తడంతో జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందేందుకు రాగా, పరీక్షలు జరిపిన అక్కడి వైద్యులు ఆమెకు కరోనా వైరస్ సోకినట్టు నిర్ధారించారు. దాంతో ఆమెతోపాటు ఆమె కుటుంబసభ్యులను క్వారంటైన్‌లో ఉంచారు.

### 10 సెకండ్లు ఊపిరి బిగపడితే కరోనా లేనట్టేనా!

**కరోనాపై** సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కొవిడ్-19 ఉన్నదా లేదా తెలుసుకునేందుకు 10 సెకండ్లపాటు ఊపిరి బిగపట్టి స్వయంగా తెలుసుకోవచ్చని విస్తృత ప్రచారం సాగుతున్నది. బాగా గాలిపీల్చి 10 సెకండ్లపాటు ఊపిరి బిగపడితే దగ్గు, ఆయాసం, చాతీలో పట్టేసినట్టు అసౌకర్యం వంటి ఇబ్బందులేమీ లేకపోతే (కొవిడ్-19 లక్షణం) ఊపిరితిత్తుల్లో ఎలాంటి ఇన్‌ఫెక్షన్ లేనట్టేనని ఇటీవల ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ కనిపించింది. అయితే ఇది అవాస్తమని నిపుణులు స్పష్టంచేశారు.





### ఈ మాతృమూర్తి మనకు ఆదర్శం!

**హైదరాబాదీ వృద్ధ మహిళ వీడియో మోదీ రీ ట్వీట్**

ఆదివారం జరిగిన జనతా కర్ఫ్యూలో.. సాయంత్రం 5 గంటలకు అందరూ బయటకువచ్చి చప్పట్లు కొట్టిన సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఓ నిరాశ్రయ వృద్ధురాలు పళ్లెంపై గణగణమని మోగిస్తున్న 11 సెకండ్ల నిడివిగల వీడియోను ప్రధాని మోదీ మంగళవారం ట్వీట్ చేశారు. 'ఈ మాతృమూర్తి భావనలను గౌరవిద్దాం.. ఇంటివద్దే ఉందాం' అని ఆమె ఇస్తున్న సందేశాన్ని పాటిద్దామని ప్రధాని మోదీ దేశప్రజలను కోరారు.

### చైనాలో మరో కొత్త వైరస్



**బీజింగ్:** ఒకవైపు కొవిడ్-19 నుంచి చావు దప్పి కన్ను లొట్టబోయిన చందంగా బయట పడుతున్న చైనాను.. మరో కొత్త వైరస్ పట్టుకొన్నది. హంటా వైరస్ మరోసారి ప్రబలుతుండటంతో ఆ దేశం కలవరపడుతున్నది. ఈ వైరస్ బారినపడి ఒకరు చనిపోయినట్టు చైనాకు చెందిన ప్రభుత్వ మీడియా సంస్థ గ్లోబల్ టైమ్స్ వెల్లడించింది. సోమవారం యున్నాన్ ప్రావిన్స్ నుంచి చార్టర్డ్ బస్సులో షాన్డోగ్ ప్రావిన్స్ వెళ్తుండగా ఆ వ్యక్తి చనిపోయినట్టు తెలిపింది. మృతుడికి వైరస్ నిర్ధారణ పరీక్షలు జరుపగా హంటా వైరస్ సోకినట్టు తేలిందని, బస్సులోని 32 మందికి కూడా హంటా వైరస నిర్ధారణ పరీక్షలు జరిపినట్టు ట్విట్టర్‌లో గ్లోబల్ టైమ్స్ పేర్కొన్నది.

# ఇండియా లాక్‌డౌన్

మొదటిపేజీ తరువాయి...

ప్రసంగించారు. కరోనా కట్టడిలో ఈ మూడు వారాలు అత్యంత కీలకమని ప్రధాని మోదీ అన్నారు. 'ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా మన దేశం, మీ కుటుంబాలు 21 ఏండ్లు వెనక్కి వెళ్తాయి' అని హెచ్చరించారు. కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు సామాజిక దూరం పాటించడమే ఏకైక మార్గమని నిపుణులతోపాటు, ఇతర దేశాల అనుభవాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. 21 రోజులపాటు ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ప్రతి రాష్ట్రం, ప్రతి కేంద్ర పాలిత ప్రాంతం, ప్రతి జిల్లా, ప్రతి గ్రామం, ప్రతి వీధినీ లాక్‌డౌన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇది కూడా కర్ఫ్యూ లాంటిదేనని, జనతాకర్ఫ్యూ కంటే కఠినమైనదని పేర్కొన్నారు. సామాజిక దూరం పాటించడం కేవలం వైరస్ సోకిన వ్యక్తికి మాత్రమే కాదని, ప్రధాని దగ్గరి నుంచి గ్రామవాసి వరకు అందరికీ వర్తిస్తుందని చెప్పారు. దీన్ని పాటించకపోతే దేశం భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఇటలీ, అమెరికా, ఫ్రాన్స్ వంటి అగ్రశ్రేణి దేశాలు కూడా వైరస్ విజృంభణతో నిస్సహాయ స్థితికి చేరాయని గుర్తుచేశారు.

**వైద్య వసతులకు రూ.15,000 కోట్లు**
కరోనా నియంత్రణకు వైద్య వసతులు మెరుగుపరిచేందుకు కేంద్రం రూ.15,000 కోట్లు కేటాయించిందని ప్రధాని మోదీ వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య సేవలకే ప్రథమ ప్రాధాన్యమివ్వాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వదంతులను, మూఢనమ్మకాలను విశ్వసించొద్దని, వైద్యులను సంప్రదించనిదే ఎలాంటి మందులు వాడొద్దని ప్రజలకు సూచించారు. నిత్యావసరాల లభ్యతపై ప్రజలకు ఆందోళన అక్కర్లేదని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. కాగా, వైద్యుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ఆఫ్ హౌస్ సర్జన్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ పీ రఘురామ్ ప్రధాని మోదీని కోరారు.

### ఉల్లంఘిస్తే.. రెండేండ్ల జైలు

లాక్ డౌన్ విధివిధానాలు ఉల్లంఘించిన వారికి రెండేండ్ల వరకు జైలు శిక్ష విధిస్తామని కేంద్ర హోం శాఖ తెలిపింది. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. అవి..

- అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు, కార్పొరేషన్లు, వాణిజ్య, ప్రైవేట్, పారిశ్రామిక సంస్థల మూసివేత.
- రేషన్ షాపులు, ఆహారం, కిరాణ దుకాణాలు, పండ్లు, కూరగాయలు, డెయిరీ ఉత్పత్తులు, మాంసం దుకాణాలు తెరిచే ఉంటాయి.
- బ్యాంకులు, బీమా సంస్థలు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా సంస్థల సేవలు యథాతథం.
- అన్ని రకాల ప్రజారవాణా సర్వీసుల రద్దు.
- మృతుల అంత్యక్రియలు, వేడుకల్లో 20 మందిని మించి అనుమతించరు
- హోటళ్లు, విద్యా సంస్థలు మూసివేత.
- వైద్య, రక్షణ, అత్యవసర సేవలతోపాటు వాయు, నేవీ సిబ్బందికి మినహాయింపు.
- పెట్రోలియం ఉత్పత్తులు, విపత్తు నివారణ విభాగం వంటి అత్యవసర సేవలకు మినహాయింపు.

# ఇటలీలో ఎందుకీ మృత్యుకేళి?

- కరోనాతో అతలాకుతలం
- ఆదిలో అలక్ష్యం.. ఆంక్షల అమల్లో నిర్లక్ష్యం
- వృద్ధుల జనాభా అధికంగా ఉండటం మరో కారణం

**రోమ్:** కరోనా మహమ్మారితో ఇటలీ విలవిల్లాడుతున్నది. ప్రపంచంలో అత్యధిక మరణాలు ఈ దేశంలోనే చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటివరకు 6,820 మంది మృత్యువాతపడ్డారు. 69,178 మంది వైరస్ బారినపడ్డారు. ప్రస్తుతం దేశం యావత్తూ దిగ్బంధంలో ఉన్నది. అయితే ఇటలీలో ఈ మృత్యుఘోష ఎందుకు సాగుతున్నది. ఆ దేశం ఎక్కడ కట్టుతప్పింది?

**ముప్పును తక్కువచేసి చూపారు..**
కరోనా తీవ్రతను అంచనా వేయడంలో ఇటలీ విఫలమైంది. కరోనా ముప్పును తక్కువ చేసి చూపడం వైరస్ వ్యాప్తికి కారణమైంది. వైరస్ ఉన్నా సాధారణ ఫ్లూ, జ్వరం లక్షణాలుగా పరిగణిస్తూ వైరస్ వ్యాప్తిని నిర్లక్ష్యం చేయడంతో అది చాపకింద నీరులా వ్యాప్తి చెందింది. ప్రభావిత ప్రాంతాలను త్వరితగతిన ఐసొలేట్ చేయడం, ప్రజల రాకపోకలను నియంత్రించడం, ఆంక్షలను కఠినంగా అమలుచేయడంలో ప్రభుత్వం అలక్ష్యం ప్రదర్శించింది.

**23శాతం వృద్ధులే..**
ప్రపంచంలోనే వృద్ధుల జనాభా అత్యధికంగా ఉన్న దేశాల్లో ఇటలీ రెండో స్థానంలో ఉన్నది. ఆ దేశ జనాభాలో దాదాపు 23% మంది 65 ఏండ్లు పైబడినవారే. వైరస్ ఉధృతికి ఇది కూడా ఒక కారణం. వృద్ధులకు కరోనా వైరస్ అత్యంత ప్రమాదకరం. ఇటలీలో యువతకు వృద్ధులతో అనుబంధం ఎక్కువ. వారి ద్వారా వైరస్ వృద్ధులకు వ్యాపించడంతో ప్రాణనష్టం పెరిగింది.



ఇటలీలోని బొలాగ్న నగరంలో నిర్మానుష్యంగా మారిన రహదారి

**ఇటలీలో కరోనా వ్యాప్తి ఇలా**

| | కేసులు | మృతులు |
|---|---|---|
| ఫిబ్రవరి 15 | 3 | 0 |
| ఫిబ్రవరి 25 | 323 | 11 |
| మార్చి 5 | 3858 | 148 |
| మార్చి 10 | 10,149 | 631 |
| మార్చి 15 | 24,747 | 1,809 |
| మార్చి 20 | 47,021 | 4,032 |
| మార్చి 24 | 69,176 | 6,820 |


**సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్**
**కోర్ట్ కాంపౌండ్, సర్దార్ పటేల్ రోడ్, సికింద్రాబాద్-500 003**

**ఆరోగ్య శాఖ**
**టెండరు ప్రకటన**

Lr.No.SCB/HS/ETen/Special/2020/653, తేది: 23-03-2020

1. దిగువ తెలిపిన పని యొక్క టెండరు పరిశీలించుట కొరకు అర్హతా ప్రమాణాలు నెరవేర్చే అర్హత గల కాంట్రాక్టర్ల నుండి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కంటోన్మెంట్ బోర్డ్, సికింద్రాబాద్-500 003 వారు దరఖాస్తులను కోరుచున్నారు:

**సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో బహిరంగ కాలువలు (పెద్దవి) లేదా ఏవేని ఇతర పనుల పూడికతీత నిమిత్తం 200 HP, 70 HP పొక్లెయిన్ మెషిన్ వాహనాలు మరియు టిప్పర్లు (09 టన్నులవి) అద్దెకు తీసుకొనే పని కోసం కాంట్రాక్ట్**

(i) టెండర్ల (ఆన్‌లైన్) దాఖలుకు చివరి తేది : **03-04-2020న 15:00 గంటల వరకు**
(ii) సాంకేతిక బిడ్ తెరుచు తేది : **04-04-2020న 15:00 గంటల తర్వాత**

2. కాగోరు/ఆసక్తిగల కాంట్రాక్టర్లు వెబ్‌సైట్ **"www.eprocure.gov.in/eprocure/app"**ని చూడాల్సిందిగా కోరబడుచున్నారు.

ఇది ఇ-టెండరు, ఈ టెండరు కొరకు మాన్యువల్‌గా ఆఫరు చేయబడిన బిడ్లు ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించబడవు, ఎలక్ట్రానిక్ ఆఫర్ బిడ్లు మాత్రమే అంగీకరించబడతాయి. సవివర సూచనల కొరకు వెబ్‌సైట్‌ని చూడగలరు.

సం/- విజయ్ కుమార్ బాలన్ నాయర్
డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్

లాక్‌డౌన్ డే-2

ధైర్యం, సంకల్పం, జీవనేచ్ఛలే సైన్యంగా
ప్రతియుద్ధం ప్రకటిద్దాం
దేహ దేశంలో జరిగే అంతర్యుద్ధం ఇది...
ఆత్మస్థైర్యంతో ఎదిరిద్దాం



అయినంపూడి శ్రీలక్ష్మి

# అత్యవసరాల్లో ఆపన్నహస్తం

## ట్విట్టర్ ద్వారా పలువురి సమస్యలకు మంత్రి కేటీఆర్ పరిష్కారం

### ఆంధ్రప్రదేశ్‌వాసులకూ భరోసా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజల అత్యవసర సమస్యలకు పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు పరిష్కారం చూపారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు, ఆంధ్రప్రదేశ్‌వాసులకు భరోసా కల్పించారు. మంగళవారం రాత్రి ట్విట్టర్ ద్వారా తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. హైదరాబాద్ హైదర్‌నగర్‌లోని రెయిన్‌బో దవాఖానలో ఈనెల 28న తనకు స్కానింగ్ ఉన్నదని.. అక్కడకు వచ్చేందుకు సాయం చేయాలంటూ ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శాంతిజ్యోతి అనే ఏడు నెలల గర్భిణి ట్విట్టర్‌లో కోరారు. దీనికి మంత్రి కేటీఆర్ స్పందిస్తూ తమ సిబ్బంది సాయం చేస్తారని భరోసానిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన చక్రధర్ మంత్రికి ట్వీట్ చేస్తూ.. ఏప్రిల్ మొదటివారంలో తన సోదరికి వైద్యులు ప్రసవం తేదీ ఇచ్చారని.. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న ఆమెకు తన తల్లి సాయం కావాల్సి ఉన్నదని తెలిపారు. కేటీఆర్ స్పందిస్తూ తమ బృందం సాయం చేస్తుందని పేర్కొన్నారు. జగిత్యాలకు చెందిన శ్రీనివాస్ తొమ్మిది నెలల గర్భిణి అయిన భార్యను హైదరాబాద్‌లోని కుటుంబసభ్యుల వద్దకు పంపేలా సాయం చేయాలని కోరగా.. తన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అత్యవసరాల్లో ఉన్నవారు 100కు డయల్ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారని, ప్రతిఒక్కరూ ఆ నంబరుకు డయల్ చేసి సాయం పొందాలని కేటీఆర్ పేర్కొన్నారు. ఈనెల 25న తన భార్యకు ప్రసవ సమయం ఉన్నదని.. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు చెంగిచెర్ల నుంచి నాగోల్ రాక్‌టౌన్ కాలనీకి తరలించేందుకు రవాణా సదుపాయం కల్పించాలని రేవంత్‌రెడ్డి కోరగా.. కేటీఆర్ భరోసా ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన సత్యను కూడా తన కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

#### రవాణా సదుపాయం కల్పించండి

పెరిటోనియల్ డయాలసిస్‌తో బాధపడుతున్న వరంగల్‌కు చెందిన పృథ్వీధర్ ట్వీట్‌చేస్తూ.. లాక్‌డౌన్ కారణంగా హైదరాబాద్ నుంచి వరంగల్‌కు డయాలసిస్ బ్యాగుల సరఫరా నిలిచిపోయిందని.. వాటిని పొందేందుకు సాయంచేయాలని కోరారు. దీంతో తమ ఆఫీసును సంప్రదించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. నర్సుగా పనిచేసే తనతల్లి ఇంటి నుంచి దవాఖానకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని లిఖిత మాథ్యూస్ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తనతల్లితోపాటు అనేకమంది ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారందరికీ రవాణా సదుపాయం కల్పించాలని కోరగా కేటీఆర్ సానుకూలంగా స్పందించారు.

## ఆపత్కాలంలో ఉన్నాం

### పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలి: మంత్రి కేటీఆర్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ రోజురోజుకూ విస్తరిస్తుండటంతో యావత్ సమాజమంతా ఆపత్కాలంలో ఉన్నదని, ఈ మహమ్మారి నుంచి తప్పించుకొనేందుకు ప్రజలంతా ప్రభుత్వానికి సహకరించాలని మున్సిపల్, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. ప్రజలంతా ఇండ్లకే పరిమితం కావాలని, ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. ఈ నెల 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో మంత్రి కేటీఆర్ మంగళవారం తన శాఖల పరిధిలోని ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, పారిశుద్ధ్య సిబ్బందితోపాటు వైద్య శాఖాధికారులతో సమన్వయం చేసుకోవాలని పురపాలకశాఖ అధికారులను ఆదేశించారు. పట్టణాల్లో ఖాళీగా ఉన్న రోడ్లపై మరమ్మతులను చేపట్టాలని, లాక్‌డౌన్ సమయాన్ని ఈ పనులకు ఉపయోగించుకోవాలని సూచించారు. లాక్‌డౌన్ వల్ల అసంఘటితరంగ కార్మికుల ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశమున్నందున రూ.5 భోజనం (అన్నపూర్ణ) కౌంటర్లను కొనసాగించాలని, ఆయా కౌంటర్ల వద్ద ఒకేసారి జనం గుమిగూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

#### సీఎస్సార్ నిధులను వినియోగించాలి

కరోనా వైరస్ నియంత్రణకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధులను ఉపయోగించేందుకు కంపెనీలు ముందుకు రావాలని మంత్రి కేటీఆర్ సూచించారు. పారిశ్రామికవాడల్లోని కాంట్రాక్టు, రోజువారీ కూలీల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రజలంతా ఇండ్లకే పరిమితమవడంతో ఇంటర్నెట్ వినియోగం భారీగా పెరిగిందని, ఈ డిమాండ్‌ను తట్టుకునేందుకు బ్యాండ్‌విడ్త్‌ని పెంచాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లను కోరారు. అత్యవసర సేవల్లో నిమగ్నమైన సిబ్బందికి అక్కడక్కడా ఇబ్బందులు ఎదురవుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, వీరి విషయంలో పోలీసులు సానుకూలంగా వ్యవహరించేలా చూడాలని హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీకి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.


## మరిన్ని దవాఖానలు సిద్ధంచేయాలి

- కరోనా కేసుల పెరుగుదలతో రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో కొవిడ్-19 పాజిటివ్ కేసులు రోజురోజుకూ పెరుగుతుండటంతో మరిన్ని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలను సిద్ధంచేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబ మంగళవారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు సర్క్యులర్ జారీచేశారు. ప్రపంచాన్ని కబళిస్తున్న కరోనా మహమ్మారిని నిరోధించేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు బాగా కృషిచేస్తున్నాయని, అయినప్పటికీ కొవిడ్-19 పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో కరోనా కట్టడికి మరిన్ని కఠినచర్యలు చేపట్టాలని, అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శులు నిత్యం కలెక్టర్లతో మానిటరింగ్ చేయాలని, రాష్ట్రాలు చేపట్టిన చర్యలను కేంద్ర ఆరోగ్యశాఖ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని స్పష్టంచేసింది.

## ఉస్మానియా సిబ్బందికి ప్రత్యేక పాస్‌లు

- పంపిణీ చేసిన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్




**సుల్తాన్‌బజార్:** ఉస్మానియా దవాఖాన వైద్యసిబ్బందికి ప్రత్యేక పాస్‌లు జారీచేశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వైద్యసిబ్బంది విధులకు హాజరయ్యే.. తిరిగి ఇండ్లకువెళ్లే క్రమంలో వీరి వాహనాలను పోలీసులు అనుమతించకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎమర్జెన్సీ సర్వీసులకు ప్రభుత్వం ఇవ్వడంతో ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్.. వైద్యసిబ్బందికి ప్రత్యేక పాస్‌లను మంగళవారం పంపిణీచేశారు.

## ఒక్కకేసూ నమోదు కావొద్దు

- సిద్దిపేట జిల్లా అధికారుల టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సిద్దిపేట జిల్లాలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాకుండా ప్రతీక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సిద్దిపేట జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ నుంచి గ్రామస్థాయి అధికారి వరకు అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఇప్పటివరకు అధికారులు, సిబ్బంది చక్కగా పనిచేశారని, ఇదే స్ఫూర్తిని చివరివరకు కొనసాగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, వార్డుసభ్యులు అంతా అలర్ట్‌గా ఉండాలని, ప్రజలకు కరోనా వైరస్‌పై అవగాహన కల్పించాలని కోరారు.

## ప్రజల క్షేమానికే లాక్‌డౌన్

- మీడియాతో మంత్రి ఎర్రబెల్లి



**వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ:** ప్రజల క్షేమం కోసమే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకున్నదని, కరోనా వైరస్ వ్యాపించకుండా ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్‌కు సహకరించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మంగళవారం వరంగల్ అర్బన్ కలెక్టరేట్ లో అధికారులతో కలిసి ఎర్రబెల్లి మీడియా తో మాట్లాడుతూ.. స్వీయ నిర్బంధాన్ని పాటిస్తున్న పల్లె, పట్టణ వాసులకు అభినందనలు తెలిపారు.

## నిత్యావసర సరుకులపై ఆందోళన వద్దు

- వ్యవసాయ,మార్కెటింగ్‌శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** కరోనా వైరస్ మహమ్మారివ్యాప్తిని ఎదుర్కొనే విషయంలో ప్రజలు మరోసారి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చూపాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ స్వీయ నిర్బంధాన్ని ప్రకటిస్తుండటం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో తెల్లరేషన్‌కార్డుదారులకు 12కిలోల చొప్పున బియ్యం, 1500 నగదు అందిస్తున్నారని.. ఇతర నిత్యావసరాలకు లోటులేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని చెప్పారు. నిత్యావసర సరకుల విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తిచేశారు.

## కేసీఆర్‌కు టీయూడబ్ల్యూజే కృతజ్ఞతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్న పోలీసు చర్యను తప్పుపట్టడంతోపాటు వారిని స్వేచ్ఛగా అనుమతించాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంపై టీయూడబ్ల్యూజే సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. జర్నలిస్టుల విధులకు పోలీసులు ఆటంకం కలిగించవద్దని సంఘం అధ్యక్షుడు అల్లం నారాయణ ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. సీఎం స్పందనపై టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, టెంజూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, ఏ రమణకుమార్ తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

## మరో ఆరుగురికి కరోనా

- రాష్ట్రంలో 39కి చేరిన కేసులు
- వైద్యారోగ్యశాఖ బులెటిన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చినవారితోపాటు గతంలో పాజిటివ్ బాధితులకు సన్నిహితంగా మెలిగిన స్థానికులకు కరోనా అంటుకుంటున్నది. మంగళవారం మరో ఆరుగురికి కొవిడ్-19 పాజిటివ్‌గా తేలింది. వారిని ఐసోలేషన్‌లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ బులెటిన్‌లో పేర్కొన్నది. ఇటీవలే లండన్ నుంచి వచ్చిన రంగారెడ్డి జిల్లా కోకాపేటవాసి (49), జర్మనీ నుంచి వచ్చిన చందానగర్‌వాసి (39), సౌదీ అరేబియా నుంచి వచ్చిన బేగంపేటకు చెందిన మహిళ (61)కు, మడికొండ మహిళ(64), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి(57), మరో వృద్ధురాలికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరందరిని ఐసోలేషన్‌లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. రాష్ట్రంలో మంగళవారం కొవిడ్-19 పాజిటివ్‌గా నమోదైన 39 మందిలో ఒకరు పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. మిగిలిన 38 మందికి ఐసోలేషన్‌లో వైద్యం అందిస్తున్నామని బులెటిన్‌లో తెలిపారు.

#### తెలంగాణలో ఫీవర్ సర్వైలెన్స్

తెలంగాణలో కరోనా కేసులు 39కి చేరడంతో రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. ఇప్పటికే లాక్‌డౌన్ ప్రకటించిన సర్కార్.. తాజాగా ఫీవర్ సర్వైలెన్స్‌ను చేపట్టాలని నిర్ణయించింది. దీని ప్రకారం జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తిని పరీక్షించనున్నారు.

## గ్లోబ్‌పై కరోనా సమాచారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా ఏ దేశంలో ఎంత ప్రభావం చూపుతున్నది అనే వివరాలు క్షణాల్లో తెలుస్తున్నాయి. చైనా నుంచి మొదలుకొని ప్రస్తుతం 196 దేశాలకు పాకిన ఈ వైరస్ బాధితుల సంఖ్యకు సంబంధించిన పరిస్థితిని https//www.covidvisualizer.com గణాంకాలతో సహ కండ్ల ముందు ఉంచుతున్నది. ఈ వెబ్‌సైట్‌లో ఓపెన్ అయ్యే గ్లోబ్‌పై ఏ దేశాన్ని క్లిక్‌చేస్తే ఆ దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య, మరణాలతోపాటు ఎంత మంది కోలుకున్నారనే వివరాలను అందిస్తుంది. అంతేకాదు.. ఆరోజు కరోనా బాధితులు, చనిపోయినవారి సంఖ్యను కూడా చూపుతుంది. గ్లోబ్‌కు దిగువన ప్రపంచవ్యాప్తంగా కరోనా బాధితులు, చనిపోయినవారి సంఖ్య (శాతాల్లో), కోలుకున్నవారి సంఖ్య (శాతాల్లో) కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నాయి.

# బయటకొస్తే కేసు బుక్కే!

- అత్యవసరమైతేనే గడప దాటాలని పోలీసుల సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌ను పట్టించుకోకుండా అనవసరంగా ఇండ్లనుంచి బయటకొచ్చేవారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఐపీసీలోని 188, 269, 270, 271 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో నిందితులకు రెండేండ్ల వరకు జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది.



హైదరాబాద్‌లో లాక్‌డౌన్‌ను ఉల్లంఘించిన వారినుంచి పోలీసులు సీజ్‌చేసిన వాహనాలు

#### హైదరాబాద్‌లో భారీగా వాహనాల సీజ్

లాక్‌డౌన్ ఉన్నా అనవసరంగా ఇండ్లనుంచి బయటకొస్తున్నవారిపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. మంగళవారం రాచకొండ పరిధిలో 150 మందిపై కేసులు నమోదుచేయడంతోపాటు 244 వాహనాలను సీజ్‌చేశారు. సైబరాబాద్ పరిధిలో సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా 350కిపైగా ట్రాఫిక్ చలాన్లు జారీచేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు 700 వాహనాలను సీజ్ చేశారు.

#### లాక్‌డౌన్ కట్టుదిట్టం

లాక్‌డౌన్‌ను అమలుచేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిన పోలీసులు.. ఎక్కడికక్కడ రోడ్లపై బారికేడ్లు ఏర్పాటుచేసి పహారా కాస్తున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి కర్ఫ్యూ ఉన్నందున ఎవరూ ఇండ్లనుంచి బయటకు రాకుండా చర్యలు తీసుకున్నారు. నిబంధనలు అతిక్రమించి రోడ్లపైకి వచ్చేవారికి నమస్కరించి మరీ లోపలికి వెళ్లాలని విజ్ఞప్తిచేస్తున్నారు. వినకపోతే లాఠీలకు పని చెప్తున్నారు. వైద్య సిబ్బంది, మీడియాపై కొన్నిచోట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించిన అంశాలు దృష్టికి రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. వారిని నిలుపుదల చేయకుండా సిబ్బందికి తగిన ఆదేశాలిచ్చారు.

#### సిబ్బందికి అలసట లేకుండా చర్యలు

అత్యవసర పరిస్థితిలో పోలీస్ సిబ్బంది 24 గంటలపాటు పనిచేయాల్సి వస్తుండటంతో వారు అలిసిపోకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉన్న సిబ్బందిని దృష్టిలో పెట్టుకుని పని గంటలను విభజించుకుంటున్నారు. కరోనా వైరస్ నియంత్రణ కోసం ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలను అందరూ కచ్చితంగా పాటించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి కోరారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని, లేదంటే ఇబ్బందులు తప్పవని హితవు పలికారు.

# కార్మికులకు భరోసా

- ముందుగానే జీతాలు చెల్లిస్తున్న భవననిర్మాణ సంస్థలు
- నిత్యావసర సరుకులు అందజేత
- నిత్యం ఆరోగ్య పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడంతో రాష్ట్రంలోని రెండు లక్షల మందికిపైగా భవననిర్మాణ కార్మికులకు పలు నిర్మాణ సంస్థలు ఆపన్నహస్తాన్ని అందజేస్తున్నాయి. కార్మికుల సంక్షేమం కోసం మైహోమ్ గ్రూప్, అపర్ణా, సైబర్ సిటీ, రాజపుష్ప లాంటి సంస్థలు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నాయి. కొన్ని నిర్మాణ సంస్థలు ముందస్తుగానే జీతాలు చెల్లించడంతోపాటు పదిరోజులకు సరిపడా బియ్యాన్ని, ఇతర నిత్యావసర సరుకులను అందజేశాయి. అధికశాతం కార్మికులు బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలవారు కావడంతో గోధుమ పిండిని సైతం సమకూర్చారు. అంతేకాకుండా వారికి ఆరోగ్య పరీక్షలను కూడా నిర్వహిస్తున్నారు. తమ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న సుమారు 3,500 మంది కార్మికులకు సరుకులను అందజేసేందుకు దాదాపు రూ.15 లక్షలు ఖర్చు చేసినట్టు ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కామరాజు వివరించారు. అలాగే రాంకీ గ్రూప్‌కు చెందిన ఐదు సైట్లలో పనిచేస్తున్న 1,000 మందికిపైగా కార్మికులకు ఉచితంగా భోజన సదుపాయాన్ని కల్పించడంతోపాటు నిత్యం ఆరోగ్య పరీక్షలు జరిపిస్తున్నామని ఆ సంస్థ ఎండీ నందకిశోర్ తెలిపారు.

## కార్మికులను తొలిగించొద్దు: కేంద్రం లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచమంతా కొవిడ్ ఉత్పాతాన్ని ఎదుర్కొంటున్న క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థలు అకారణంగా ఉద్యోగులను తొలిగించొద్దని, ప్రధానంగా కాంట్రాక్టు లేదా క్యాజువల్ కార్మికుల జీతాలపై కోత విధించొద్దని కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ కార్యదర్శి హీరాలాల్ సమారియా ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. కార్మికులు సెలవు తీసుకుంటే.. వారు పనిచేస్తున్నట్టే పరిగణించాలని సూచించారు. కోవిడ్-19 వల్ల సైట్లలో పనులు నిలిచిపోయినా.. వారంతా పనుల్లోనే ఉన్నట్టుగా భావించాలని కోరారు.

# మార్కెట్ల వద్ద రద్దీ వద్దు


- దాణా వాహనాలను అడ్డగించొద్దు
- అధికారులకు మంత్రి ఈటల ఆదేశం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా కూరగాయలు, సూపర్ మార్కెట్ల వద్ద జనం గుమికూడకుండా చూడాలని, నిత్యావసరాల ధరలు పెరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ఈటల రాజేందర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రం లాక్‌డౌన్‌లో ఉన్నందున నిత్యావసరాలు, అత్యవసర సేవలపై సీఎస్ సోమేశ్‌కుమార్‌తో కలిసి మంత్రి ఈటల మంగళవారం బీఆర్కేభవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరెన్సీ ద్వారా వైరస్‌వ్యాప్తికి అవకాశాలు ఉన్నందున వినియోగదారులు డిజిటల్ పేమెంట్లుచేయాలని సూచించారు. మటన్, చికెన్, కోడిగుడ్లు, ఫిష్ మార్కెట్లు తెరిచి ఉంచేందుకు, దాణా సరఫరా వాహనాలు నడుపడానికి వీలుగా ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు.

## రెడ్ నోటీస్.. ఇంటికి రావొద్దు ప్లీజ్

### కరోనా అనుమానితుల ఇండ్లకు నోటీసులు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడికి అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. విదేశాలనుంచి వచ్చి క్వారంటైన్‌లో ఉన్నవారి కుటుంబాలకు మంగళవారం నుంచి రెడ్ నోటీసులను జారీచేస్తున్నది. కుటుంబసభ్యుల అనుమతితో 'మా ఇంటికి రావొద్దు.. మా దగ్గరికి రావొద్దు' అని రాసిఉన్న నోటీసులను ఇండ్లకు అంటిస్తున్నది. వ్యాప్తి కట్టడికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 వేల బృందాలు రాత్రి పగలు పనిచేస్తున్నాయి. ఇంటింటికీ తిరిగి విదేశాల నుంచి వచ్చినవారికి ఇప్పటికే క్వారంటైన్ ముద్రలువేశాయి. వాస్తవానికి 20 రోజుల కిందట విదేశాల నుంచి వచ్చిన వారిలో చాలామంది తమ వివరాలను వెల్లడించలేదు. ఇందులో ఇటలీ, ఇండోనేషియా, అమెరికా, దుబాయ్ నుంచి వచ్చినవారు వేలసంఖ్యలో ఉన్నారు. కొందరు బాధ్యతాయుతంగా అధికారులకు సమాచారమిచ్చినా.. చాలామంది తమకు విమానాశ్రయాల్లో నిర్వహించిన థర్మల్ స్క్రీనింగ్‌లో ఏమీ తేలలేదని స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. 14 రోజుల తర్వాత ఒక్కొక్కరికి పాజిటివ్ లక్షణాలు బయటపడుతుండటంతో అధికార బృందాలు డేగ కన్నుతో నిఘావేశాయి.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లోనే అమ్మకాలు

### ఉగాది పండుగపూట ఇబ్బంది రాకుండా చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ సమయంలో ప్రజలకు కూరగాయల కొరత రాకుండా చూసేందుకు మార్కెటింగ్‌శాఖ అప్రమత్తమైంది. ఆదివారం జనతా కర్ఫ్యూ సందర్భంగా కూరగాయల రవాణా నిలిచిపోయి సోమవారం మార్కెట్లలో కొరత ఏర్పడటంతో వ్యాపారులు ఒకేసారి ధరలు పెంచారు. దీంతో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్కెటింగ్‌శాఖ అధికారులను ప్రత్యక్షంగా రంగంలోకి దింపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటుచేశారు. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కూరగాయలు దిగుమతి చేశారు. అంగన్‌వాడి కేంద్రాలకు పాలను పంపిణీ చేసేందుకు మహిళా, శిశు సంక్షేమశాఖ, విజయ డెయిరీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## లాక్‌డౌన్ మినహాయింపులివే..

### సీఎస్ సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో లాక్‌డౌన్ నుంచి మరికొన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి మినహాయింపు ఇస్తూ సీఎస్ సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సచివాలయంలోని సాధారణ పరిపాలన విభాగం సిబ్బందికి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో గల సిబ్బందికి, విభాగాధిపతులకు, అన్ని జిల్లాల కలెక్టరేట్లు, డివిజన్ ఆఫీసులు, మండల కార్యాలయాల్లోని సిబ్బందికి, పోలీసులకు, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సిబ్బందికి, పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ సంస్థల సిబ్బందికి, అగ్నిమాపక సిబ్బందికి, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణా, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, విద్యుత్ (ట్రాన్స్‌కో, జెన్‌కో) శాఖల సిబ్బందికి, హైదరాబాద్ మెట్రో వాటర్ సీవరేజ్ బోర్డు సిబ్బందికి, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, మార్కెటింగ్ శాఖల సిబ్బందికి, వినియోగ వ్యవహారాలు, పౌరసరఫరాల విభాగం సిబ్బందికి, కాలుష్య నియంత్రణ బోర్డు, తూనికలు, కొలతల శాఖ, డ్రగ్ కంట్రోల్, సింగరేణి కాలరీస్, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కొవిడ్-19 నియంత్రణ సేవల్లో పాల్గొంటున్న సిబ్బందికి, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ సిబ్బందికి 'లాక్‌డౌన్' నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఒమర్ అబ్దుల్లా విడుదల



ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నేత ఒమర్ అబ్దుల్లా గృహనిర్బంధం నుంచి విడుదలయ్యారు. దాదాపు 8 నెలల తర్వాత ఆయనకు విముక్తి లభించింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత పలువురు కశ్మీరీ నేతలను కేంద్రం గృహనిర్బంధంలో ఉంచింది. ఒమర్ తండ్రి, ఎన్సీ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా ఇటీవలే విడుదల అయ్యారు.

## బలపరీక్షలో నెగ్గిన శివరాజ్‌సింగ్ చౌహాన్



చౌహాన్

**భోపాల్:** మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ మంగళవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో విజయం సాధించారు. సీఎంగా సోమవారం బాధ్యతలు చేపట్టిన చౌహాన్ మూజువాణి ఓటుతో నెగ్గారు. కాంగ్రెస్ సభ్యులు హాజరుకాలేదు. రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ప్రారంభంకాగానే విశ్వాసాన్ని కోరుతూ చౌహాన్ తీర్మానాన్ని ప్రతిపాదించారు.

#### సింధియాకు ఊరట

బీజేపీలో చేరిన జ్యోతిరాదిత్య సింధియాకు ఊరట లభించింది. ఆయనతోపాటు కుటుంబంపై తాజాగా నమోదైన ఫోర్జరీ కేసును మూసేసినట్లు ఆ రాష్ట్ర ఆర్థిక నేర విభాగం తెలిపింది. కాగా, ఓ భూమి అమ్మకంలో సింధియా, ఆయన కుటుంబం ఫోర్జరీ పత్రాలు సృష్టించారని 2014లో సురేంద్ర అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. 2018లో నాటి బీజేపీ ప్రభుత్వం ఈ కేసును మూసివేసింది. కమల్‌నాథ్‌ను సింధియా విభేదించడంతో మార్చి 12న ఆయన మరోసారి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

## కోల్‌కతాను ఇలా చూస్తాననుకోలేదు



**కోల్‌కతా:** ఇంతకుముందెప్పుడూ కోల్‌కతా నగరంలో ఇలాంటి పరిస్థితిని చూడలేదని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ పేర్కొన్నాడు. కొవిడ్-19 కారణంగా లాక్‌డౌన్ ప్రకటించడంతో నగరం మూగబోయినట్లు అనిపిస్తున్నదని.. ఎక్కడ చూసినా రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయని పేర్కొన్నాడు. 'నా నగరాన్ని ఇలా చూస్తానని ఎప్పుడూ అనుకోలేదు. త్వరలోనే పరిస్థితుల్లో మార్పు రావాలని ఆశిస్తున్నా. అప్పటివరకు సామాజిక దూరం పాటిస్తూ సురక్షితంగా ఉండండి' అని దాదా ట్వీట్ చేశాడు. మరోవైపు ఐపీఎల్ 13వ సీజన్ ప్రారంభంపై ఇప్పుడప్పుడే ఏం చెప్పలేమని గంగూలీ పేర్కొన్నాడు. 'ప్రస్తుత పరిస్థితుల్లో ఐపీఎల్ గురించి ఏం చెప్పలేను. లీగ్ వాయిదా వేసిన రోజు ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాంటి వాతావరణమే ఉంది' అని గంగూలీ చెప్పుకొచ్చాడు.

## ఇంగ్లిష్.. బుక్స్.. సినిమా

### భారత హాకీ ప్లేయర్ల ఆటవిడుపు



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ మహమ్మారి ప్రబలుతుండటంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సెంటర్‌కే పరిమితమైన భారత హాకీ జట్లు.. ఈ సమయాన్ని పుస్తకాలు చదివేందుకు, ఇంగ్లిష్ భాషపై పట్టు పెంచుకునేందుకు, బాలీవుడ్ సినిమాలు చూసేందుకు వినియోగించుకుంటున్నాయి. పురుషుల జట్టు గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ మాట్లాడుతూ.. 'దైనందిన శిక్షణ కొనసాగుతూనే ఉన్నది. కానీ, విరామం దొరికినప్పుడు మాత్రం ఆ సమయాన్ని ఇంగ్లిష్ పుస్తకాలు చదివేందుకు వినియోగించుకుంటున్నాం. వీడియో కాల్స్ ద్వారా కుటుంబ సభ్యులతో టచ్‌లో ఉంటున్నాం'అని అన్నాడు. 'అనాలటికల్ కోచ్ క్రిస్ సిరియెల్లో భార్య మాకు ఇంగ్లిష్ క్లాస్‌లు తీసుకుంటున్నది. ఆమె ఇచ్చిన అసైన్‌మెంట్‌లో పుస్తక పఠనం కూడా ఒక భాగమే. అందుకే మంచి ఇంగ్లిష్ పుస్తకాలు చదువుతున్నా'అని ఫార్వర్డ్ ప్లేయర్ మన్‌దీప్ సింగ్ పేర్కొన్నాడు.



### గోపీచంద్‌కు కరోనా పరీక్షలు

**శంకర్‌పల్లి రూరల్:** భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్‌కు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇటీవలే బర్మింగ్‌హామ్ నుంచి హైదరాబాద్ చేరుకున్న గోపీచంద్.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని జనవాడ శివారులోని తన ఫామ్‌హౌజ్‌లో ఉంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది.. తాసీల్దార్ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ మృదుల..గోపీచంద్‌ను పరీక్షించారు.

# టోక్యోకు బ్రేక్

### కరోనా ఎఫెక్ట్‌తో ఒలింపిక్స్ వచ్చే ఏడాదికి వాయిదా




### జపాన్ ప్రధానితో చర్చల తర్వాత ఐవోసీ చరిత్రాత్మక నిర్ణయం

### 2021లో జరిగినా టోక్యో 2020 పేరుతోనే నిర్వహణ

### నిర్ణయాన్ని ఆహ్వానించిన సభ్యదేశాలు, అథ్లెట్లు

**ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న కరోనా వైరస్ దెబ్బ.. అతిపెద్ద క్రీడాపండుగ ఒలింపిక్స్‌పై పడింది. వైరస్ విలయతాండవంతో ఆలస్యమే శరణ్యమైన వేళ.. టోక్యో ఒలింపిక్స్‌ను వచ్చే ఏడాదికి వాయిదా వేస్తూ ఐవోసీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఎన్నో సభ్యదేశాలు, మరెన్నో క్రీడాసంఘాలు, ఎందరో అథ్లెట్ల వినతులు, డిమాండ్లు, ఉపసంహరణ హెచ్చరికల తర్వాత ఐవోసీ తలొగ్గింది. కరోనా విశ్వమారి విజృంభణతో ఒలింపిక్ అర్హత పోటీల రద్దు, ప్రాక్టీస్ చేసేందుకు వీలు కాని పరిస్థితులు, ఆరోగ్యం భయాలతో తీవ్ర ఆందోళన చెందిన అథ్లెట్లు ఎట్టకేలకు ఊపిరి పీల్చున్నారు. మరోవైపు ఒలింపిక్స్ వాయిదాను సభ్యదేశాలన్నీ ఆహ్వానించాయి.**

**టోక్యో:** కరోనా వైరస్(కొవిడ్-19) విజృంభణతో ప్రపంచం మొత్తం వణికిపోతుండడంతో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. క్రీడలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడడంతో టోక్యో ఒలింపిక్స్,పారాలింపిక్స్‌ను వచ్చే ఏడాదికి వాయిదా వేసింది. జపాన్ ప్రధాని షింజో అబే, ఐవోసీ అధ్యక్షుడు థామస్ బాచ్ మధ్య మంగళవారం టెలిఫోన్ చర్చలు సాగగా, ఒలింపిక్స్‌ను ఏడాది వాయిదా వేయాలని అబే తొలుత ప్రతిపాదించారు. దీనికి థామస్ బాచ్ పూర్తి అంగీకారం తెలిపాడు. దీంతో ఎలాంటి హింసాత్మక పరిస్థితులు లేకుండా వైరస్ కారణంతో ఒలింపిక్స్ తొలిసారి ఆలస్యం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9వ తేదీ మధ్యలోనే విశ్వక్రీడలను జరిపి తీరుతామని వారం క్రితం వరకు చెప్పిన ఐవోసీ.. పరిస్థితులు చేయిదాటిపోవడంతో ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. కరోనా తీవ్రత పెరగడంతో పాటు సభ్యదేశాలు, క్రీడా సంఘాలు, అథ్లెట్ల డిమాండ్ మేరకు 2021కి వాయిదా వేసింది. 'అథ్లెట్లు, ఒలింపిక్స్‌తో సంబంధమున్న వారితో పాటు ప్రపంచవ్యాప్త ప్రజల ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకొని ఒలింపిక్స్‌ను వాయిదా వేస్తున్నాం. 2020 తర్వాత 2021 వేసవి ముగిసే కంటే ముందే క్రీడలను నిర్వహిస్తాం' అని ఐవోసీ, టోక్యో క్రీడల నిర్వాహకులు ఓ సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. కాగా వచ్చే ఏడాది వరకు ఒలింపిక్స్ జ్యోతి జపాన్‌లోనే ఉండనుంది.

#### 124ఏండ్లలో తొలిసారి..

ఒలింపిక్స్ వాయిదా పడడం 124ఏండ్ల ఆధునిక క్రీడల చరిత్రలో ఇదే తొలిసారి. ప్రపంచ యుద్ధాల కారణంగా 1916(బెర్లిన్), 1940(టోక్యో), 1944(లండన్)లో విశ్వక్రీడలు రద్దయ్యాయి. మాస్కో 1980, లాస్‌ఏంజెల్స్ 1984 ఒలింపిక్స్ కొన్ని దేశాల ప్రాతినిధ్యం లేకుండానే జరిగాయి.

#### 2021లో జరిగినా.. 'టోక్యో 2020'

కరోనా వైరస్ కారణంగా వచ్చే ఏడాదికి వాయిదా పడినా.. 'టోక్యో 2020' పేరుతోనే ఐవోసీ టోక్యో ఒలింపిక్స్ నిర్వహించనుంది. ఈ విషయాన్ని టోక్యో సిటీ గవర్నర్ యురికో కోకీ తెలిపారు. 'పేరు.. టోక్యో 2020గానే ఉంటుంది. ఒలింపిక్స్ రద్దు చేసే సమస్యే లేదు. 2021 వేసవిలో ఒలింపిక్స్ నిర్వహించడమే మా లక్ష్యం. అథ్లెట్లు అందుకోసమే సిద్ధమవ్వాలి' అని యురికో చెప్పారు. మార్చి 26న ప్రారంభం కావాల్సిన ఒలింపిక్ టార్చ్ రిలేను నిలిపేస్తున్నట్టు టోక్యో 2020 అధ్యక్షుడు యషిరో మోరీ చెప్పాడు.

#### టోక్యోకు నిరాశ

కండ్లు చెదిరే ఆతిథ్యంతో.. మునుపెన్నడూ లేని హంగులతో.. ప్రపంచం అబ్బురపోయేలా టోక్యో విశ్వక్రీడలను నిర్వహించాలనుకున్న జపాన్ ఆశలు ఈ ఏడాది నెరవేరలేదు. దాదాపు 12.6 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9.50లక్షల కోట్లు) ఖర్చుతో ఒలింపిక్స్‌ను ఘనంగా నిర్వహించాలని వేసుకున్న ప్రణాళికలు నిలిచిపోయాయి. విశ్వక్రీడల వాయిదాతో జపాన్ ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపనుంది. వచ్చే ఏడాది నిర్వహించడం కోసం మరింత ఖర్చు చేయాల్సి రావడంతో మరింత భారం పడనుంది. 1940లోనూ జపాన్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జపాన్ కవ్వింపు చర్యలకు పాల్పడిందన్న కారణంగా ఒలింపిక్స్‌ను హెల్సింకోకు ఐవోసీ తరలించింది. అయితే రెండో ప్రపంచ యుద్ధం కారణంగా 1940 ఒలింపిక్స్ చివరికి రద్దైపోయాయి.

#### ఆహ్వానించిన ఐవోఏ

టోక్యో ఒలింపిక్స్‌ను వాయిదా వేస్తూ ఐవోసీ తీసుకున్న నిర్ణయాన్ని భారత ఒలింపిక్ కమిటీ(ఐవోఏ) ఆహ్వానించింది. ఆరోగ్య ఆందోళన మధ్య శిక్షణ పొందుతూ గురవుతున్న ఒత్తిడి నుంచి భారత అథ్లెట్లకు ఊరట లభించిందని తెలిపింది. 'ఐవోసీ నిర్ణయాన్ని ఐవోఏ ఆహ్వానిస్తున్నది. లాక్‌డౌన్ పూర్తయ్యాక అథ్లెట్లు, క్రీడా సమాఖ్యలు, స్పాన్సర్లతో చర్చించి.. ప్రణాళికలను మళ్లీ రూపొందిస్తాం' అని ఐవోఏ సెక్రటరీ రాజీవ్ చెప్పాడు.



"అర్హత సాధించుకున్నా.. ఒలింపిక్స్ వాయిదా పడడం పట్ల సంతోషంగా ఉన్నా. అయితే క్వాలిఫికేషన్ ప్రక్రియ ఎలా సాగుతుందో తెలుసుకోవాలని ఆత్రుతగా ఉంది. లాక్‌డౌన్ ఉన్న కారణంగా ఎవరూ సన్నద్ధత గురించి ఆలోచించకండి. ముందు సురక్షితంగా ఉంటే.. ఆ తర్వాత ప్రాక్టీస్ గురించి ఆలోచించొచ్చు.

**- సైనా నెహ్వాల్, భారత స్టార్ షట్లర్**



ప్రస్తుత పరిస్థితులు అసలు బాగోలేవు. జీవితమే ప్రాధాన్యం.. తర్వాతే అన్నీ. మేం వేచిఉండగలం. అథ్లెట్ల సంక్షేమమే అతిముఖ్యం. ఈ నిర్ణయం(ఒలింపిక్స్ వాయిదా) అందరకీ మంచిదే. సన్నద్ధమయ్యేందుకు నాతో పాటు అందరికీ ఎక్కువ సమయం దొరికింది.

**- మేరీ కోమ్, భారత దిగ్గజ బాక్సర్**



ఇది మంచి నిర్ణయం. ఎందుకంటే అందరూ ఆందోళనతో ఉన్నారు. అథ్లెట్ల ఆరోగ్యమే ప్రాధాన్యంగా ఉండాలి. ఎవరూ సరిగా ప్రాక్టీస్ చేయడం లేదు. ఇది భారత్ పరిస్థితి ఒక్కటే కాదు. ప్రపంచంలో అన్ని దేశాలది. ముందు కరోనా మహమ్మారి నుంచి ప్రజలను కాపాడాలి.

**- బజరంగ్ పునియా, భారత రెజ్లర్**

# వాణిజ్యం

## ఎల్ఐసీపై కరోనా పిడుగు

### రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు కోల్పోయిన సంస్థ

**న్యూఢిల్లీ, మార్చి 24:** ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ పెట్టుబడులు అమాంతం కరిగిపోయాయి. కరోనా వైరస్ దెబ్బకు స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతుండటంతో అతి పెద్ద సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీ ఏకంగా రూ.2 లక్షల కోట్ల వరకు కోల్పోయింది. ప్రస్తుత సంవత్సరంలో దేశీయ స్టాక్ మార్కెట్లు 30 శాతం వరకు పతనమవడంతో అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లు అయింది. డిసెంబర్ చివరి నాటికి రూ.6.02 లక్షల కోట్లుగా ఉన్న ఎల్ఐసీ పెట్టుబడులు గడిచిన రెండున్నర నెలల్లో ఏకంగా రూ.1.9 లక్షల కోట్లు తగ్గి రూ.4.14 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. మరోవైపు ఐపీవోకి రావడానికి సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతుండటం మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఎస్ఈ 500 ఇండెక్స్‌లో ఉన్న 209 కంపెనీల్లో ఎల్ఐసీ ఒక్క శాతానికి పైగా పెట్టుబడులు పెట్టింది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల క్యాపిటలైజేన్ మొత్తం విలువలో వీటి వాటా 65 శాతానికి పైగా ఉన్నది. ఆవిరైన పెట్టుబడుల్లో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల వాటా అత్యధికంగా 30 శాతం ఉండగా, ఆ తర్వాతి చమురు అండ్ గ్యాస్, సిగరెట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెటల్స్, ఆటోమొబైల్స్, మౌలిక రంగాలు ఉన్నాయి. ఈ కరోనా వైరస్ దెబ్బకు సేవల రంగం తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండగా, కానీ, వ్యవసాయ రంగంపై ఎలాంటి ప్రభావం చూపకపోవడం కొసమెరుపు.



**ఎల్ఐసీ కోల్పోయిన ఆదాయం**

| రంగం | విలువ(కోట్లలో) |
|---|---|
| ఎన్‌బీఎఫ్‌సీ | 56,810 |
| ఆయిల్ అండ్ గ్యాస్ | 36,020 |
| సిగరెట్ మార్కెట్ | 17,374 |
| ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ | 15,826 |
| మెటల్ | 12,045 |
| ఆటోమొబైల్స్ | 11,329 |
| మౌలికం | 10,669 |

## రూ.52 లక్షల కోట్లు ఆవిరి

**కరోనా** వైరస్ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నభిన్నం చేస్తున్నది. మూడు నెలల క్రితం చైనాలో బయటపడ్డ ఈ వైరస్ ప్రపంచ మహమ్మారిగా మారిపోయింది. ఈ దెబ్బకు పలు దేశాలు ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటిస్తున్నప్పటికీ ఆర్థిక వ్యవస్థలు ఇప్పట్లో కోలుకునే అవకాశాలేమి కనిపించడం లేదు. ఈ వైరస్ దెబ్బకు ప్రపంచ స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్లు సరేసరి. డిసెంబర్ 31న రూ.155.53 లక్షల కోట్లుగా ఉన్న బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ ప్రస్తుతం రూ.103 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే సగానికి సగం రూ.52 లక్షల కోట్లు ఆవిరైపోయాయి. సోమవారం ఒకేరోజు రూ.14.22 లక్షల కోట్ల సంపద కరిగిపోయింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న రూ. 7.67 లక్షల కోట్ల ద్రవ్యలోటు కంటే ఏడురెట్లు అధికం. అలాగే అల్జీరియాతో పాటు 130 దేశాల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కంటే అధికం కూడా.

# ఇక చార్జీల్లేవ్

### ఏటీఎంలలో నగదు ఉపసంహరణ జరిమానాలు ఎత్తివేత

### పొదుపు ఖాతాల్లోనూ కనీస నగదు నిల్వలు అక్కర్లేదు

### జూన్ 30దాకా వెసులుబాటునిచ్చిన కేంద్రప్రభుత్వం

### కరోనా వైరస్ నేపథ్యంలో ఖాతాదారులకు ఊరట



**న్యూఢిల్లీ, మార్చి 24:** ఇకపై చార్జీలు పడుతాయన్న భయంతో.. ఖాతాలున్న బ్యాంకుల ఏటీఎంల కోసం వెతుక్కోవాల్సిన అక్కెర లేదు. కనిపించిన ఏటీఎంలలో నగదును తీసుకోవచ్చు. కరోనా వైరస్ నేపథ్యంలో బ్యాంక్ ఖాతాదారులకు కేంద్రం ఊరటనిచ్చింది. వచ్చే మూడు నెలలపాటు ఇందుకుగాను ఎటువంటి చార్జీలు ఉండబోవని ప్రకటించింది. ప్రస్తుతం మెట్రో నగరాల్లో ఖాతాలున్న బ్యాంక్ ఏటీఎంలలో నెలకు ఐదుసార్లు, ఇతర ఏటీఎంలలో మూడుసార్లు నగదును ఉచితంగా ఉపసంహరించుకునే వెసులుబాటు ఉన్నది. అయితే ఇప్పుడీ నిబంధనల్ని తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రకటించారు. ఏ బ్యాంక్ ఖాతాదారులైనా.. తమకు అందుబాటులో ఉన్న ఇతర ఏటీఎంలలో స్వేచ్ఛగా నగదును ఉపసంహరించుకోవచ్చని, జూన్ 30 వరకు చార్జీల భారం ఉండదని చెప్పారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. అలాగే ఖాతాల్లో కనీస నగదు నిల్వ లనూ ఉంచనవసరం లేదని ఆమె వెల్లడించారు. మూడు నెలలపాటు ఇంతేనన్నారు. కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో ప్రజలెవరూ ఇబ్బందులకు గురికావద్దన్న ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్న ఆమె.. పరిస్థితుల తీవ్రతనుబట్టి మరికొన్ని నెలలు ఈ సౌకర్యాలను పొడిగిస్తామని తెలిపారు.




### జూన్ 30 వరకు జీఎస్టీ రిటర్నుల గడువు

**జీఎస్టీ** రిటర్నుల గడువును సైతం మరో మూడు నెలలు పొడిగించింది కేంద్ర ప్రభుత్వం. మార్చి, ఏప్రిల్, మే నెలలకు గాను దాఖలు చేయాల్సిన జీఎస్టీ రిటర్నులను జూన్ 30 వరకు చేసుకునే అవకాశం కల్పించింది. మార్చి 31లోగా ముందస్తు జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయాల్సి ఉండగా, దేశవ్యాప్తంగా కరోనా వైరస్‌తో దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. అలాగే రూ.5 కోట్ల లోపు వార్షిక టర్నోవర్ కలిగిన సంస్థలు ఆలస్యంగా చెల్లించనున్న జీఎస్టీపై వడ్డీ లేదా జరిమానా మినహాయింపునిచ్చింది. రూ.5 కోట్ల అధిక టర్నోవర్ కలిగిన సంస్థలు మాత్రం జీఎస్టీపై 9 శాతం వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. కానీ, లేట్ ఫీ లేదా జరిమానా నుంచి మినహాయింపునిచ్చింది. వీటితోపాటు పరిహారం స్కీంను ఎంపిక చేసుకునే కాలపరిమితిని సైతం జూన్ 30 వరకు పొడిగించింది.

### మరికొన్ని కీలక నిర్ణయాలు

- 2018-19 ఐటీ రిటర్నుల దాఖలు గడువు మార్చి 31 నుంచి జూన్ 30కి పెంపు
- జూన్‌లోగా చెల్లిస్తే వివాద్ సే విశ్వాస్ పథకంలో 10 శాతం అదనపు చెల్లింపులుండవ్
- అడ్వాన్స్ ట్యాక్స్, టీడీఎస్, తదితర చెల్లింపుల ఆలస్యంపై 9 శాతానికి తగ్గిన వడ్డీరేటు
- వడ్డీలు, జరిమానాలు, ఆలస్య రుసుములు లేవు
- 5 కోట్లకుపైగా టర్నోవర్ ఉన్న సంస్థలు జూన్ ఆఖరు వారంలోగా రిటర్న్స్ దాఖలు చేసుకోవచ్చు
- 15 రోజులు ఆలస్యమైనా 9 శాతం వడ్డీరేటే (ప్రస్తుతం 18 శాతం)
- సబ్‌కా విశ్వాస్ పథకం కింద చెల్లింపుల తేదీని మార్చి నుంచి జూన్‌కు పొడిగింపు
- ట్రేడ్ ఫైనాన్స్ కస్టమర్ల కోసం డిజిటల్ ట్రేడ్ లావాదేవీల కోసం బ్యాంక్ చార్జీల తగ్గింపు
- దివాలా కేసు కనిష్ఠ పరిమితి కోటి రూపాయలకు పెంపు

### ఆధార్-పాన్ లింక్ గడువు మూడు నెలల పెంపు

**ఆధార్‌తో** పాన్ కార్డు అనుసంధానం గడువును కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలలు పెంచింది. ఇదివరకే రెండు సార్లు పెంచిన కేంద్రం..తాజాగా దేశవ్యాప్తంగా కరోనా వైరస్ విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ గడువును మార్చి 31 నుంచి జూన్ 30 వరకు పెంచుతూ మంగళవారం నిర్ణయం తీసుకున్నది. జనవరి చివరినాటికి దేశవ్యాప్తంగా 30.75 కోట్ల పాన్ నంబర్లు ఆధార్‌తో లింక్ చేసినట్లు ఐటీ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. ఐటీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వెబ్‌సైట్ ద్వారా పాన్-ఆధార్‌తో లింక్ చేసుకునే అవకాశం ఉంటుంది.

## స్టాక్ మార్కెట్లకు ఉద్దీపనల జోష్

### సెన్సెక్స్ 693, నిఫ్టీ 191 పాయింట్ల లాభం

**ముంబై, మార్చి 24:** కరోనా వైరస్ భయాలతో కుప్పకూలిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు కోలుకున్నాయి. కరోనా వైరస్‌తో ప్రభావితమవున్న రంగాలను పునరుత్తేజం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం త్వరలో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన వార్తలతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు తిరిగి కోలుకునేలా చేశాయి. ప్రారంభంలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన బీఎస్ఈ సెన్సెక్స్ తీవ్ర ఊగిసలాటల మధ్య చివరకు 692.79 పాయింట్లు లేదా 2.67 శాతం లాభపడి 26,674.03కి చేరుకున్నది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 190.80 పాయింట్లు (2.51 శాతం) అందుకొని 7,801.05 వద్ద స్థిరపడింది. గత మూడు నెలలుగా సంపదను కోల్పోతున్న మదుపరుల సంపద రూ.1.82 లక్షల కోట్ల మేర పెరిగింది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.1, 82,769.92 కోట్లు పెరిగి రూ.1,03,69, 706.20 కోట్లుగా నమోదైంది. ఇన్ఫోసిస్ 12 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, రిలయన్స్, మారుతి, హెచ్‌సీఎల్ టెక్, నెస్లె, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ బ్యాంక్, సన్‌ఫార్మా, ఓఎన్‌జీసీ, టెక్ మహీంద్రా, టీసీఎస్, టైటన్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, హీరో, టాటా స్టీల్‌లు లాభపడ్డాయి. మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, ఎల్ అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఆటోల షేర్లు తగ్గుముఖం పట్టాయి.

### ఉద్యోగుల్ని తీసేయొద్దు

**దేశ ఆర్థిక** వ్యవస్థను కరోనా వైరస్ భీకర మందగమనంలోకి నెట్టిన నేపథ్యంలో ఉద్యోగుల తొలగింపు, వేతన కోతలకు దిగరాదని దేశీయ వ్యాపార, పారిశ్రామిక రంగాలను నిపుణులు కోరుతున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో స్తంభించిన ఉత్పాదక, వ్యాపార లావాదేవీల మధ్య ఆయా సంస్థలు వ్యయ నియంత్రణ చర్యలకు దిగుతున్నాయి. దీంతో మానవత్వం చూపాలని సూచిస్తున్నారు. నిజానికి మందగమన పరిస్థితుల నుంచి త్వరగా కోలుకోవాలని వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టడం సర్వసాధారణం.

### జీతాలు తగ్గించం..

**ప్రముఖ** విమానయాన సంస్థ ఇండిగో..తన సిబ్బందికి శుభవార్తను అందించింది. కరోనా వైరస్ విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ నెల చివరివరకు విమాన సర్వీసులను రద్దు చేసిన సంస్థ..తాజాగా సిబ్బంది జీతాలు లేదా జీతాల బకాయిల్లో కోత విధించబోమని సిబ్బందికి హామీ ఇచ్చింది ఇండిగో. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఈ నెల చివరివరకు దేశవ్యాప్తంగా విమాన సర్వీసులను నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి అనుగుణంగా అన్ని సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

### అమర్ రాజా కూడా..

**బ్యాటరీల** తయారీ సంస్థ అమర రాజా కూడా ఉత్పత్తిని నిలిపివేసింది. కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ నెల చివరివరకు ప్లాంట్లో ప్రొడక్షన్‌ను నిలిపివేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా రోజువారిగా పరిశీలిస్తున్నట్లు, అవసరమైన చర్యలను తీసుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | |
|---|---|
| ఫారం ధర | 60.00 |
| రిటైల్ లైవ్ | 82.00 |
| డ్రెస్‌డ్ | 119.00 |
| స్కిన్‌లెస్ | 135.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | |
|---|---|
| హైదరాబాద్ | 210.00 |
| రంగారెడ్డి | 210.00 |
| మెదక్ | 210.00 |
| కరీంనగర్ | 213.00 |
| వరంగల్ | 213.00 |
| డజన్ ధర | 40.00 |

నమస్తే తెలంగాణ
/nt.zindagi
# జిందగీ
8 హైదరాబాద్
బుధవారం 25 మార్చి 2020
WWW. NTNEWS.COM



# పండగపూట పచ్చడి చికిత్స

మశూచి.. కలరా.. ప్లేగు.. వ్యాధి ఏదైనా ఇలాంటి మహమ్మారులను తిప్పికొట్టగల ఆయుధం భారతీయుల దగ్గర ఉంది. అదే ఆయుర్వేదం. మన జీవన విధానంలో ఒకటిగా కలిసిపోయి, మన ఆహారాన్నే ఔషధంగా అందించే శాస్త్రీయ వైద్యవిధానం ఇది. విదేశాల నుంచి వచ్చిన వాళ్లే తప్ప, ఇక్కడే ఉంటున్న మనవాళ్లెవరిలోనూ పెద్దగా కరోనా పాజిటివ్ లక్షణాలు బయటపడలేదు. వందల సంవత్సరాలుగా పండుగలు, సంప్రదాయాల పేరిట ఆచరిస్తున్న జీవన విధానమే కరోనా లాంటి వ్యాధులను ఎదుర్కోగలిగే సామర్థ్యాన్ని మనకు అందించిందంటున్నారు ఆయుర్వేద వైద్యులు. సంవత్సరాది నాడు మనం చేసుకునే ఉగాది పచ్చడి వ్యాధినిరోధక శక్తిని పెంచే పరమౌషధం అనీ అంటున్నారు. అందులోని షడ్రుచులూ అనేక రోగాల నుంచి మనల్ని కాపాడే ఆరు రక్షణ కవచాలని చెప్తున్నారు.

మనం తీసుకునే ఆహారం షడ్రసోపేతమైనదిగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. మధుర రసం (తీపి), ఆమ్ల రసం (పులుపు), లవణ రసం (ఉప్పు), తిక్త రసం (చేదు), కటు రసం (కారం), కషాయరసం (వగరు)... ఇలా నూతన సంవత్సరంలో రాబోయే కష్టసుఖాలను సమదృష్టితో స్వీకరించడానికి మనల్ని సమాయత్తం చేస్తుంది ఉగాది పచ్చడి. ఇది రాబోయే కాలంలో రానున్న ప్రమాదకర వ్యాధుల నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి పెద్దలు ఆహార రూపంలో మనకు అందించిన ఔషధం కూడా! అప్పట్లో, మహమ్మారి వ్యాధులు ప్రబలే సమయంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా ఆ వ్యాధులు వచ్చినవాళ్ల ఇళ్లకు రాకపోకలు ఆపేవారు. ఎవరికి వారు స్వీయ నిర్బంధంలో ఉండే వాళ్లు. అలా వాటి తీవ్రత తగ్గిపోయేది. ఇప్పుడు వచ్చిన కరోనా కూడా అటువంటిదే. కాబట్టి, సెల్ఫ్ క్వారెంటైన్ పాటిస్తూ ... మిగతా పోషక విలువలతో పాటు ఉగాది పచ్చడిని కూడా తీసుకుంటే రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు. వ్యాధి కారక సూక్ష్మజీవులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండొచ్చు.

**... అయితే ఉగాది పచ్చడిని పండక్కే పరిమితం చేయకుండా మండలం (40) రోజులు తీసుకుంటే ఇమ్యూనిటీ పెరగడంలో సహాయపడుతుంది.**

**షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిలో ఒక్కో రుచికి వాడే ఒక్కో పదార్థం ఒక్కో రకమైన ఆరోగ్య విలువలను కలిగివుంటుందని చెప్తుంది ఆయుర్వేదం.**



**బెల్లం**

దీన్ని ఆయుర్వేద పరిభాషలో మధుర రసంగా చెప్తారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో ముందుం టుంది. బాలింతలకు పాలు బాగా వచ్చేట్టు చేస్తుంది. శక్తిప్రేరకంగానే కాకుండా శరీరంలోని హానికర పదార్థాలను తొలగిస్తుంది (డీటాక్సిఫికేషన్). మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. బీపీని కంట్రోల్ చేస్తుంది. రక్తాన్ని శుభ్రం చేసి, రక్తహీనత రాకుండా నివారిస్తుంది. కీళ్లనొప్పులు తగ్గిస్తుంది. బరువు తగ్గించడంలో, కండరపుష్టిని జీవక్రియను మెరుగుపరచడంలో కూడా మధుర రసం కీలకమైనది. మహిళల నెలసరి సమస్యలకు, మూడ్‌స్వింగ్స్‌కి, పిఎంఎస్‌కి ఇది మంచి మందు.



**చింతపండు**

ఆమ్లరసానికి ప్రతీక. వేయి విధాలుగా వ్యాధులను నివారిస్తుందని చెప్తోంది ఆయుర్వేదం. ఆమ్ల రసంలో కాల్షియం, ఇనుము, సోడియం, జింక్, ఫాస్ఫరస్, విటమిన్– సి, బి, ఎ, కెలు పుష్కలంగా ఉంటాయి. దీనిలోని ఫైబర్లు ఎల్‌డిఎల్ (చెడు) కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి. చింతపండులోని పొటాషియం యాంటి ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. అంతేకాదు.. ఇది యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి క్యాన్సరస్‌గానే కాకుండా వ్యాధినిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. చింతపండు వెయిట్‌లాస్ సప్లిమెంట్‌గా పనిచేస్తుంది. సహజసిద్ధమైన లాక్జేటివ్ (మలబద్దక నివారణి)గా ఉపయోగపడుతుంది.



**ఉప్పు**

దీన్ని లవణ రసంగా చెప్తారు. మామూలు ఉప్పు కాకుండా సైంధవ లవణం వాడితే మంచిది. కూరలకు రుచినిచ్చే ఉప్పు వాతహారిణిగా కూడా పనిచేస్తుంది. శరీరానికి కావాల్సిన 93 మూలకాల్లో 84 వరకూ లవణ రసం ద్వారానే అందుతాయి. ఇనుము, కాల్షియం, జింక్, పొటాషియం లాంటివెన్నో దీంట్లో ఉంటాయి. ఇది జీవక్రియను మెరుగుపరిచి, ఆహారం చక్కగా జీర్ణం కావడానికి తోడ్పడుతుంది. కడుపునొప్పి తగ్గించి, డీవార్మింగ్ మందుగా పనిచేస్తుంది. వ్యాధి నిరోధక శక్తి పెంచడంలో కూడా కీలకమైనదే. సైనస్, ముక్కు ఇన్‌ఫెక్షన్లను నియంత్రిస్తుంది. బరువు తగ్గించడానికి, ఒత్తిడి నుంచి బయటపడేయడానికి కూడా ఉపయోగపడుతుంది. చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. వాపులు, చిగుళ్ల వ్యాధులకు మంచి మందు.




**మామిడి**

ఆయుర్వేదం చెప్పిన కషాయ రసం కోసం ఉగాది పచ్చడిలో మామిడి కాయ ముక్కలను వాడుతాం. ఇది వాత, పిత్తాలను తగ్గిస్తుంది. మామిడికాయను ఉడికించి రసం తీసుకుంటే వడదెబ్బకు మంచి ఔషధం అవుతుంది. ఎండతాకిడి వల్ల ముక్కు నుంచి రక్తస్రావం కాకుండా నివారిస్తుంది. డీహైడ్రేషన్ రాకుండా కాపాడుతుంది. డయేరియా, మలబద్ధకం, కడుపుబ్బరం లాంటి సమస్యల నుంచి రక్షిస్తుంది. మామిడి ముఖ్యమైన ఉపయోగం రక్తనాళాలు కుంచించుకుపోకుండా కాపాడడం. ఇది యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాన్ని కలిగివుంటుంది. దీనిలో విటమిన్ – సి, కె, ఎ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఇమ్యూనిటీ పెంచుతుంది.



**వేప**

తిక్త రసం అంటే ... చేదు రుచి అన్నమాట. వేపను ఒక ఔషధాలయంగా చెప్పవచ్చు. మన ఆరోగ్యాన్ని నడిపించే ఔషధాలకు నాయకురాలు ఇది. సహజసిద్ధమైన యాంటివైరల్ ఔషధంగా వేప పనిచేస్తుంది. గతంలో మశూచి వ్యాధి చికిత్సలో వేప కీలకపాత్ర పోషించింది. వైరల్ ఇన్‌ఫెక్షన్లకే కాకుండా బాక్టీరియా, ఫంగస్ ఇన్‌ఫెక్షన్లకు కూడా ఇది మంచి మెడిసిన్. శరీరంలోని సహజ రోగనిరోధక శక్తిని పెంచడంలో వేపను మించింది లేదంటుంది ఆయుర్వేదం. ఆటలమ్మ, మొటిమల లాంటి చర్మ వ్యాధులకు కూడా ఇది బాగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దోమల వ్యాప్తిని అరికట్టడంలో వేప కీలకమైనది. వేపనూనెలో విటమిన్– ఇ పుష్కలం. కాబట్టి చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. వేప ఒక అద్భుతమైన, శక్తిమంతమైన యాంటి వైరల్, యాంటి బాక్టీరియల్, యాంటి ఫంగల్ ఔషధంగా అనేక పరిశోధనల్లో రుజువైంది. అందుకే ఇతర దేశాల వాళ్లు వేపకు పేటెంట్ కావాలని మనపై ఒత్తిడి తెస్తున్నారు.



**మిరియాలు**

కటురసానికి ఉదాహరణ మిరియాలు. ఆయుర్వేదంలో మసాలాల రాజుగా చెప్తారు. ఇది శరీరానికి చేయని మేలు లేదు. వ్యాధి నిరోధక శక్తి పెంచడంతో పాటుగా యాంటి ఆక్సిడెంట్‌గా, యాంటి ఇన్‌ఫ్లమేటరీగా పనిచేస్తుంది. నొప్పులు తగ్గిస్తుంది. శ్వాసకోశ వ్యాధులకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. అంతేకాదు మెదడు పనితీరు మెరుగుపరుస్తుందని, అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధుల చికిత్సలో ఉపయోగపడుతుందని అనేక అధ్యయనాల్లో తేలింది. రక్తంలో చక్కెరలు పెరగకుండా కంట్రోల్ చేస్తుంది. మనం తీసుకునే పోషకాలు శరీరం గ్రహించడానికి సహాయపడుతుంది.



**డాక్టర్ సూర్యపల్లి సారంగపాణి**
ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ సభ్యులు,
మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్,
భారత ప్రభుత్వం
సాయి భరద్వాజ అడ్వాన్స్‌డ్ ఆయుర్వేద హాస్పిటల్
హైదరాబాద్.
98490 44358

## వాట్సప్‌లో వైద్యం..

**కరోనా నేపథ్యంలో కార్పొరేట్ డాక్టర్లు, హాస్పిటల్స్ మీకోసం మేమున్నామంటూ ముందుకు వస్తున్నారు. వాట్సప్ ద్వారా మీ సమస్య పంపండి. మేము సమాధానాలిస్తాం అంటున్నారు పలువురు డాక్టర్లు. యశోద హాస్పిటల్స్ అయితే ఆన్‌లైన్ వీడియో కన్సల్టేషన్‌ను కూడా ప్రారంభించింది.**



కొవిడ్ –19 కరోనా ఇన్‌ఫెక్షన్ 80 శాతం మందిలో దానికదే నయమవుతుంది. 14 శాతం మందికి హాస్పిటల్‌లో చేరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కేవలం 6 శాతం మందికి మాత్రమే వెంటిలేటర్ లేదా ఐసియులో పెట్టాల్సిన అవసరం ఉంటుంది. 60 ఏళ్లు పైబడిన వాళ్లకే కాకుండా అధిక రక్తపోటు, గుండె జబ్బులు, ఇంతకుముందు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినవాళ్లు, మధుమేహులకు కూడా దీని రిస్కు ఎక్కువ. ప్రభుత్వ సూచనల మేరకు నడుచుకుంటే మీరు సురక్షితంగా ఉంటారంటున్నారు డాక్టర్లు.

**డాక్టర్ సి. రఘు**
కార్డియాలజిస్ట్, ఏస్టర్ ప్రైమ్ హాస్పిటల్
వాట్సప్ నెం. 98481 55650

**రిస్కు ఉన్నవాళ్లు ఇలా చేయండి...**

- గుంపులుగా ఉండొద్దు. డిన్నర్లు, ఫంక్షన్లు, మత, సామాజిక కార్యకలాపాల కోసం కూడా అందరూ ఒక్కచోట చేరొద్దు. దగ్గు, జలుబు ఉన్నవాళ్లకు దూరంగా ఉండండి.
- స్వీయ నిర్బంధం మేలు. అవసరమైతే తప్ప మీ గదిలో నుంచి బయటకు రాకండి.
- అత్యవసర పరిస్థితి అయితే తప్ప హాస్పిటల్‌కి కూడా వెళ్లొద్దు. తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సి వస్తే మాస్కు ధరించండి. రోజుకి నాలుగైదు సార్లు హ్యాండ్ వాష్ చేసుకోండి.
- ఫ్లూ వాక్సిన్ తప్పనిసరిగా తీసుకోండి. న్యూమోకోకల్ వ్యాక్సిన్ కూడా తీసుకుంటే మంచిది.
- హైడ్రాక్సిక్లోరోక్విన్ మందు మీ సొంతంగా వాడొద్దు. సొంతంగా వాడితే ప్రమాదంలో పడతారు. నిపుణుల సలహా తర్వాతే ఏ చికిత్స అయినా.

'మమ్మల్ని కలవడానికి హాస్పిటల్‌కి రావాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే ఉండి మీ సమస్యను వాట్సప్ చేయండి. మేము సమాధానం ఇస్తాం' అంటున్నారు డాక్టర్లు...

**డాక్టర్ చైతన్య చల్లా**
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్,
ఇంటర్నల్ మెడిసిన్, క్రిటికల్ కేర్
కేర్ హాస్పిటల్స్
వాట్సప్ నెం. 99633 18181

### యశోదలో వీడియో కన్సల్టేషన్

ప్రస్తుతం నెలకొన్న అత్యవసర పరిస్థితుల దృష్ట్యా యశోద హాస్పిటల్స్ రోగుల సౌకర్యార్థం 'ఆన్‌లైన్ వీడియో డాక్టర్ కన్సల్టేషన్' సదుపాయాన్ని అందిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ ఇంట్లో సురక్షితంగా ఉండాలని, అత్యవసర వైద్యసలహా కోసం తమను ఆన్‌లైన్ వీడియో కన్సల్టేషన్ ద్వారా సంప్రదించమని చెప్తున్నారు యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.యస్. రావు. డయాబెటిస్, కిడ్నీ సమస్యలు, గుండె సమస్యలు మొదలైన దీర్ఘకాలిక రోగులందరికీ వైద్యులు ఆన్‌లైన్‌లోనే వైద్యసలహా ఇస్తారు. ఈ సేవ కేవలం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సదుపాయాన్ని ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని ఇంటివద్దనే మెరుగుపర్చుకోవచ్చని చెప్తున్నారు. అత్యవసరమైన పరిస్థితి అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

**ఆన్‌లైన్ టెలి కన్సల్టేషన్ పొందడానికి లింకులు ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి...**

www.yashodahospital.com
**ఫోన్ చేయాల్సిన నంబర్ :**
**040–4567 4567**

## 'కరోనా ఉగాది' చేసుకోండిలా..

**పండగ అంటే అందరూ కలిసి చేసుకునే సంబరం. కరోనా నేపథ్యంలో... మిగతావారికి ఎంత దూరంగా ఉండి చేసుకుంటే అంత మంచిదంటున్నారు నిపుణులు. అందుకే కొవిడ్ - 19 ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండాలంటే, ఉగాది నాడు ఈ జాగ్రత్తలు పాటించండని సూచిస్తున్నారు...**



- తోరణాలు, మామిడి కాయల లాంటివన్నీ నీటి ధార కింద శుభ్రంగా కడగాలి. వేడినీటిలో వేసి తీస్తే మరీ మంచిది. కూరగాయలను ఉప్పునీటితో కడగాలి.
- బయటికి వెళ్లేటప్పుడు మాస్కు వేసుకోవడం మరవొద్దు. బయటి నుంచి వస్తువులను కొని, ఇంటికి తెచ్చిన వ్యక్తి లోపలికి రాగానే ముందు వెంటనే స్నానం చేయాలి. ఆ వ్యక్తి దుస్తులను కూడా వేడినీటిలో నానబెట్టి, శుభ్రం చేయాలి. బయటినుంచి తెచ్చిన బ్యాగును ఇంట్లో ఉంచకూడదు. బట్టతో చేసిన బ్యాగు అయితే వేడినీటితో శుభ్రం చేయాలి.
- వస్తువులు పట్టుకునే చేతితోనే సాధారణంగా ముక్కు, నోరు, కన్ను ముట్టుకుంటుంటాం. అలా రొటీన్‌గా వాడే చేయి కాకుండా వేరే చేత్తో వస్తువులు ముట్టుకోవాలి.
- సాధారణంగా ఏ పండుగ అయినా ఇంట్లో చేసుకున్న పిండివంటలు మన ఇరుగు పొరుగు వాళ్లకు పంచుతుంటాం. ఉగాది పచ్చడి కూడా రుచి చూపిస్తుంటాం. అలాంటివేవీ చేయకూడదు.
- ఉగాది పండగ అంటే పంచాంగ శ్రవణం తప్పనిసరి. ఇందుకోసం అందరూ ఒక్కచోట చేరుతారు. కానీ ఈసారి ఆ కార్యక్రమం రద్దు చేసుకోండి. ఏ టీవీలోనో, రేడియోలోనో చెప్పే పంచాంగం వినడమో, లేదా ఇంట్లోనే పంచాంగం చదువుకోవడమో ఉత్తమం.
- మన ఆచారాల్లో ప్రస్తావించేది.... అనేక రకాల యాంటి మైక్రోబియల్ పదార్థాలే. వాటిలో బెస్ట్ యాంటివైరల్ వేప. అందుకే మామిడి తోరణాలే కాదు.. వేప ఆకులను కూడా గుమ్మాలకు వేలాడదీయండి. వేప ప్రాధాన్యం ఈరోజుతో మొదలైతే ఆషాఢం దాకా ఉంటుంది. కాబట్టి ఆగస్టులో వచ్చే బోనాల వరకూ ఇలా వేప ఆకుల తోరణాలను కట్టుకోండి. వేప ఆకుల గాలి కూడా యాంటి సెప్టిక్‌గా పనిచేస్తుంది.
- ఐసిఎంఆర్, సిసిఆర్ఎస్ఇ, ఆయుష్ సంస్థల సూచనల ప్రకారం ... అల్లం, వెల్లుల్లి, జీలకర్ర లాంటివి వైరల్ ఇన్‌ఫెక్షన్లను నివారిస్తాయి. కాబట్టి పండగ నాడు చేసుకునే వంటకాల్లో వీటిని ఎక్కువగా వాడుకోండి.

